కర్నూలు | నంద్యాల
వార్త
30 జూన్, 2023 శుక్రవారం పేజీలు 4

## మతవిద్వేశ్యాలను రెచ్చగొట్టి ప్రవర్తిసే కఠిన చర్యలు:జిల్లా ఎస్పీ



**నంద్యాల క్రైం, జూన్ 29, ప్రభాతవార్తః** తొలి ఏకాదశి, బక్రీద్ పండుగను పురస్కరించుకొని భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల ఈద్గా, భీమవరం రోడ్డు ఈద్గా, పలు పికెటింగ్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం బీమవరం ఈద్గాలో జిల్లా కలెక్టరు, ఎమ్మెల్సీ ఇసాక్‌తో కలిసి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. తొలి ఏకాదశి బక్రీద్ పర్వదినాలు ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఈసందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని దేవాలయాలు, మసీదులు, ప్రార్థన స్థలాల వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేశామన్నారు. సర్వమత సమ్మేళనమైన భారతదేశంలో అన్ని మతాల, కులాల సాంప్రదాయాలు గౌరవించడం మనందరి బాధ్యత అని తెలిపారు. హిందువులకు పవిత్రమైన తొలి ఏకాదశి, ముస్లీంలకు పర్వదినమైన బక్రీద్ పండుగ ఒకేరోజ వచ్చినందున తమ ఇష్టదైవాలను అరాధించుకోవాలని తెలిపారు. ప్రశాంతవాతావరణంలో పండుగలు జరుపుకోవడానికి వారం రోజుల కృషి ఉందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. సోషల్ మీడియాపై నిరంతర నిఘా ఉందన్నారు.

## సప్తనదుల సంగమేశ్వరునికి.. భక్తుల తాకిడి..!



**కొత్తపల్లి, జూన్ 29, ప్రభాతవార్త:** సప్తనదుల సంగమేశ్వరునికి తొలి ఏకాదశి సంధర్భంగా సంగమేశ్వరం భక్తులతో కిటకిటలాడింది. గురువారం ఏపి, తెలంగాణ రాష్ట్రం నుండి వేల సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ముందుగా సప్తనదుల్లో స్నానాలు ఆచరించి నదీమ తల్లికి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఆంజినేయస్వామిని దర్శించుకొని ఆలయంలోకి ప్రవేశించి వేపదార శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే నవగ్రహా విగ్రహామూర్తులకు కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

**ప్రమాదకరంగా బోట్ల ప్రయాణం:** తెలంగాణ నుంచి వచ్చే భక్తులకు సోమశిల నుంచి సంగమేశ్వరానికి కృష్ణా నదిపై బోట్లలో ప్రమాదకరంగా భక్తులను చేరవేస్తున్నారు. ఎటువంటి లైఫ్ జాకెట్స్ ధరించ కుండా పరిమితికి మించి బోట్లలో భక్తులను ఎక్కించి తరలిస్తున్నారు. భక్తుల నుండి రూ.100 వసూలు చేయడంతో రానుపోను రూ.200లు అవుతుందని ఇది ఇబ్బంది కరంగా ఉందని భక్తులు అంటున్నారు.



# పెద్ద ఆస్పత్రికి రాజకీయ గ్రహణం..!

- : అమాత్యుని అండతో కొందరు అధికారుల అవినీతి
- : ఎంపీ ఒత్తిడితో మెడికల్ షాప్‌ల మాయాజాలం
- : ఎమ్మెల్యే ఆగ్రహంతో ముఖం చాటేసిన పర్యవేక్షణ అధికారి
- : చోద్యం చూస్తున్న జిల్లా యంత్రాంగం

కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని బడుగు బలహీన వర్గాలకు వైద్యం అందించే పెద్ద ఆస్పత్రికి రాజకీయ గ్రహణం పట్టింది. పేదల వైద్యానికి వచ్చే నిధులను దోచుకకునే వారికి కొందరు నాయకుల అండదండలున్నాయి. అక్కడి అధికారుల అవినీతికి పరోక్షంగా సహకరిస్తున్నాడని ఓ అమాత్యునిపై ఆరోపణలున్నాయి. సెక్యూరిటీ ఏజన్సీకి ప్రతి నెలా రూ.10 లక్షలు అదనంగా రావడంలో ఓ రాజకీయ పెద్దమనిషి పాపమే ఉందన్న చర్చ రెండేళ్లుగా నడుస్తూనే ఉంది. శానిటేషన్ కాంట్రాక్టర్ తీరు ఇష్టారాజ్యం కావడానికి మరో చిన్న లీడరు ప్రమేయం ఉందన్న ఊహాగానాలున్నాయి. ఇక రోగులకు ఇచ్చే ఆహారం (డైట్) కాంట్రాక్టు విషయంలోనూ నాయకుల జోక్యం ఉందన్న వాదన ఉంది. తాజాగా ఒక ఎంపీ ఆస్పత్రిలో అమ్మే జనిరిక్ మందులలో కూడా వాటా పోందేందేకు ప్రయత్నిస్తున్నడన్న దుమారం రేగింది. ఒక్కటేమిటి ఆస్పత్రి అధికారుల పోస్టింగ్‌లు, బదిలీల వ్యవహారాలన్ని కూడా నిబంధనల మేరకు కాక నాయకుల కనుసన్నలలో జరుగుతున్నాయని బహిరంగంగా చర్చ జరుగుతోంది. నాయకుల ప్రమేయంతో అవినీతి హద్దుమీరి... ప్రభుత్వ పరువు రోడ్డున పడి... ఆస్పత్రికి వచ్చే రోగులు కూడా బహిరంగంగా విమర్శిస్తున్నా.... సదరు నాయకులకు ఆ విషయాలు తెలియవా..? లేక తెలిసినా పట్టించుకోవడం లేదా..? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పేవారే లేరు. ఇక ఆస్పత్రి నిర్వహణ గాడితప్పడంపై నియంత్రణ చేయాల్సిన జిల్లా యంత్రాంగం సైతం రాజకీయ నాయకులను చూసి ఒకింత వెనకడుగు వేస్తోందన్న భావన కలుగుతుంది. ఇక్కడ ఉన్న ప్రధానాంశం ఏమంటే ఈ వ్యవహారాలన్ని ప్రస్తుత నిర్వాహకుల సమయంలోనే జరుగుతున్నాయి. గతంలో ఇలాంటి పరిస్థితి చాలా తక్కువ.

• వివరాలు 2లో



**కర్నూలు, జూన్ 29, ప్రభాతవార్త :** దుకాణంలో ధరలు ఎక్కువగా అమ్ముతున్నారని ఒకటి.. అమ్మకూడని సర్జికల్ ఐటమ్స్ అమ్ముతున్నారని రెండు.. సర్జికల్ వస్తువులు అమ్ముతున్నారని మూడు అభియోగాలు ఉన్నాయి. అంతేకాక ఆసుపత్రికి చెల్లించాల్సిన మొత్తాల్లో బకాయి ఉందని మరో అపవాదు. ఇవన్నీ నిర్వాహణలో వచ్చే సమస్యలు. ఇలాంటి సమస్యలకు నోటీసులు ఇవ్వడం, స్పందించకపోతే తనిఖీలు చేయడం, అప్పటికి స్పందించకపోతే సదరు దుకాణాలకు సంబంధించి హెడ్ డిపార్ట్మెంట్ అయిన మెప్మా అధికారులకు నోటీసులు ఇవ్వడం చేయాలి. కానీ ఇక్కడ అలాంటివేమి అధికారులకు తెలియదు. కారణం అడ్మినిస్ట్రేషన్ విషయంలో అక్కడి అధికారులు వారు చెప్పిందే చట్టం అంటారు. అదే క్రమంలో రెండు రోజుల క్రితం ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న పొదుపు సంఘాల నిర్వహణలో ఉన్న జనరిక్ మందుల ..

**ఆసుపత్రి సూపరింటెండెంట్ నీతిమంతుడా..? అని స్థానిక ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ ఆస్పత్రి ఏడిని నిలదీశారు. పరిపాలనలో, నిధులు ఖర్చు చేయడంలో కీలకపాత్ర పోషించే ఏడి అందుకు సమాధానం ఇవ్వకపోవడమే కాక నోరు మెదపలేకపోయాడు. అంటే మౌనం అంగీకారమేనా అన్న అనుమానం రావడం సహజం. ఆస్పత్రి పెద్ద నీతిమంతుడు కాదంటే మొత్తం వ్యవస్థే గాడి తప్పిందనడం అతిశయోక్తి కాదు. ఎమ్మెల్యే నోట ఆ మాట రావడానికి గల కారణం ఏమంటే.... కర్నూలు జనరల్ ఆస్పత్రిలో తక్కువ ధరకు అమ్మే జనరిక్ మందుల దుకాణాలను తమ స్వంతం చేసుకోవాలని ఓ నాయకుడు ప్రయత్నించడమే. ఆ క్రమంలో ఆసుపత్రి అధికారులు ఆ దుకాణాలను సీజ్ చేశారు.**

## ఘనంగా ప్రథమ ఏకాదశి వేడుకలు

- భక్తులకు తప్త ముద్రధారణ
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



**మంత్రాలయం, జూన్ 29, ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులోని జయనగరలో ఉన్న శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ప్రథమ ఏకాదశి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదర్శన హోమం, మహా మంగళ హారతి తదితరు పూజలు నిర్వహించారు. పీఠాధిపతి తరలివచ్చిన భక్తులకు తప్త ముద్రధారణ చేశారు. అనంతరం భక్తులను తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందారు.

## బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న టిజీ భరత్



**కర్నూలు న్యూసిటి, జూన్ 29, ప్రభాతవార్తః** కర్నూలులోని ముస్లీం సోదరులందరు బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరుకున్నట్లు కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ టిజీ భరత్ అన్నారు. పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా కర్నూలు నగరంలోని పాత ఈద్గా వద్ద ముస్లీం సోదరులతో కలిసి ప్రార్థనల్లో టిజీ భరత్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ముస్లీం సోదరులను అలింగనం చేసుకొని బక్రీద్ శభాకాంక్షలు తెలియజేశారు. బాధలు, త్యాగాలు స్మరించుకుంటేనే ఎన్ని కష్టాలు ఎదురైనా జయించుకుంటూ జీవితంలో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు టిజీ భరత్ అన్నారు. ముస్లీం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మద్దిలేటిస్వామి క్షేత్రంలో స్వాతి నక్షత్ర వేడుకలు



**బేతంచెర్ల, జూన్29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మినరసింహాస్వామి ఆలయం నందు స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతినక్షత్ర వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుండే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

**విమాన గోపురం పై విగ్రహాల ఏర్పాటుకు చైర్మన్ రూ. 2లక్షల విరాళం :** స్వామివారి ఆలయ పునర్నిర్మాణం పూర్తి చేసుకుని ఇటీవల ప్రారంభం కావడంతో విమాన గోపురం పై ఏర్పాటుచేసే విగ్రహాలకు ఆలయ చైర్మన్ భువనగిరి సీతారామచంద్రుడు భువనగిరి జోత్స్న దంపతులు రూ. 2లక్షల చెక్కును ఈవో పాండురంగారెడ్డికి అందజేశారు.



## భగ్గుమంటున్న.. కూరగాయల ధరలు..!

గత కొద్ది రోజులుగా మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అకాశాన్నంటుతున్న కూరగాయల ధరలతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు విలవిలలాడుతున్నారు. ఏవీ కొనుగోలు చేసేలా లేవంటూ అవేదన వ్యక్తం చేస్తున్నారు. అరోగ్యానికి మేలు చేసే కూరగాయాలు తినే పరిస్థితి లేదంటూ వాపోతున్నారు. సరిగ్గా రోజుల వ్యవధిలోనే కూరగాయల ధరలు సగానికి సగం పైగా పెరిగాయి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఉత్పత్తి తగ్గడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందంటూ వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. స్థానికంగా పండే కూరగాయల ధరలతో పాటు, బెంగుళూరు రకాల కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. గత నెల రోజుల క్రితం వున్న ధరలతో పోలిస్తే ఇప్పుడు రెండితలయ్యాయి.

### - విలవిల లాడుతున్న సామాన్యులు

**కొలిమిగుండ్ల, జూన్ 29, ప్రభాతవార్త** ఆకు కూరలు మొదలు కొని పచ్చిమిర్చి, వంకాయ, క్యారెట్ వరకు అన్ని రకాల కూరగాయాల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో సామాన్య ప్రజలు పచ్చడి అన్నం తినడానికి కూడా వీలుకాని పరిస్థితి నెలకొంది. శీతా కాలంలో సాగు చేసిన తోటలు ఇప్పటి వరకు దిగుబడులు వచ్చాయి. ప్రస్థుతం ఎండలు పెరిగి నీటి కొరత ఏర్పడటంతో వీటి ఉత్పత్తి తగ్గిపోయింది. నెల రోజుల క్రితం రూ.15-20 పలికిన టమాట ధర ఏకంగా రూ.50-60 వరకు చేరుకోవడం వినియోగదారులకు అందోళన కలిగిస్తోంది. మరోపక్క గతంలో ఎన్నడూలేని విధంగా పచ్చి మిర్చి ఘాటు నషాళానికి ఎక్కింది. ఏకంగా రూ.120 కి చేరుకోవడం వినియోగదారులను భయాందోళనకు గురిచేస్తోంది. ఇంకోపక్క మాంసం కూరల్లో ఉపయోగించే అల్లం, వెల్లుల్లి ధరలు అకాశమే హద్దుగా తయారయ్యాయి. అల్లం అల్లంత దూరాన రూ.250కి చేరగా వెల్లుల్లి సైతం రూ.100 వరకు పలుకుతోంది. దీంతో అదివారం సరదాగా గారెలు చేసుకొని అందులోకి కాస్త చికెన్ చేసుకుందామన్న పేద వర్గాల అశలకు గండిపడింది. దీంతో అదివారం కూడా అకు కూరలతోనే సరిపెట్టు కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ పలు వర్గాల ప్రజలు నిట్టూర్చుతున్నారు.

**ప్రస్థుతం మార్కెట్లో లభించే పలు రకాల కూరగాయల ధరలు కిలోల వారిగా ఈ విధంగా వున్నాయి.**

1. పచ్చిమిర్చి రూ.120
2. టమాట రూ.60
3. వంకాయ రూ.50
4. అల్లం రూ.250
5. వెల్లుల్లి రూ.100
6. బీరకాయ రూ.60
7. బెండకాయ రూ.50
8. క్యారెట్ రూ.60
9. బీట్‌రూట్ రూ.50
10. అలుగడ్డ రూ.40
11. ఉల్లిగడ్డలు రూ.30
12. కాకరకాయలు రూ.80
13. క్యాబేజి రూ.25
14. సొర్రకాయలు రూ.25



# మాయమాటలు నమ్మి మోసపోవద్దు..

### ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



**ప్యాపిలి జూన్29(ప్రభాతవార్త):** ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు చేప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని లక్ష్మి నరసింహ పంక్షన్ హాల్‌లో గురువారం యువత సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాపిలి మండలంలో చేసిన అభివృద్ధిని యువతకు అంకితం చేస్తున్నామని ప్రకటించారు. మండలంలో సిసిరోడ్డు, తారురోడ్డు, పార్కులు, తాగునీరు, సాగునీరు అందించడం కోసం చెరువులకు హంద్రీనీవా నీటిని నింపడం వంటి అభివృద్ధి పనులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని నిలదీశారు. గ్రామాలలో ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటిని అందించడమే వైకాపా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వైకాపా ప్రభుత్వం వేసిన రోడ్లపై నడుస్తున్న టిడిపి నాయకులకు అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రజలకు తప్పుడు సమాచారాలతో ప్రచారం చేస్తూ మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కళాశాలలు, పాఠశాలలు, రోడ్ల ఏర్పాటు చేసిన అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తున్నామని దశాబ్దాలుగా పాలన చేసిన వారు నియోజకవర్గానికి చేసిందేమి లేదని ఎద్దేవా చేశారు. యువత భాగస్వామ్యం లేకుండనే నారాలోకేష్ యువగళం పాదయాత్ర చేయడం విడ్డురంగా ఉందన్నారు. నాలుగు రోజుల వారాహి యాత్రలో ప్రజలకు ఏమి చెప్పలేక పవన్‌కళ్యాణ్ జ్వరం నెపంతో విశ్రాంతి తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గత టిడిపి హయంలో రాష్ట్రంలో అభివృద్ధి చేయకుండ ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చి చంద్రబాబు కల్లబోల్లి కబుర్లు చెపుతున్నారని, వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని గుర్తు చేశారు. రానున్న ఎన్నికలలో వైకాపాను గెలిపించి జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. రెండుసార్లు తమను గెలిపించి రాజకీయ బిక్ష పెట్టిన డోన్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామని ప్రకటించారు.

**మోటర్‌సైకిళ్ళ ర్యాలీ:** రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి ప్యాపిలి పట్టణానికి వచ్చిన సందర్భంగా ప్యాపిలి మండల వైకాపా నాయకులు, కార్యకర్తలు, యువకులు భారీ సంఖ్యలో మోటర్ సైకిళ్ల ర్యాలీని నిర్వహించారు. స్థానిక కార్యాలయం నుండి పాతబస్టాండు, కొత్తబస్టాండు మీదుగా లక్ష్మి పంక్షన్ హాల్ వరకు బైక్‌ర్యాలీని నిర్వహించి మంత్రి బుగ్గనకు ఘనస్వాగతం పలికారు. యువత సదస్సుకు పెద్దసంఖ్యలో యువకులు పాల్గొని మంత్రి బుగ్గనను సన్మానించారు. బక్రీద్ సందర్భంగా ముస్లీం సోదరులు మంత్రి బుగ్గనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బోరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి దిలీప్‌చక్రవర్తి, మీట్ చైర్మన్ శ్రీరాములు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బోరెడ్డి పుల్లారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బోరా మల్లికార్జునరెడ్డి, వ్యవసాయ మండలి చైర్మన్ మెట్టుపల్లె వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ లక్ష్మిదేవి, సీమ సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వరరెడ్డి, గండికోట చిన్న రామాంజనేయులు, బోరెడ్డి రఘునాథ్‌రెడ్డి, షాషావలి, మస్తాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# భూ బకాసురుల గుండెల్లో రైళ్లు..!

- నిజాయితీగల అధికారిపై బురదజల్లె ప్రయత్నం
- మహానంది మండలంలో మొదలైన సమగ్ర భూసర్వే
- భూ సర్వే మొదలై 24 గంటలు గడవకముందే తప్పుడు వార్త కథనాలు

**మహానంది, జూన్ 29, ప్రభాతవార్తః** కబ్జాకు కాదేది అనర్హం అన్నట్లు ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కాకుల్లా వాలిపోయి అందినకాడికి దండుకొని తమ సొంతం చేసుకొని వాటిని అప్పన్నంగా అనుభవిస్తున్న భూ బకాసురుల తీరుపై కన్నెర చేసిన సర్కార్ వాటి లెక్కలు తేల్చేపనిలోపడింది. ఈనేపథ్యంలో సమగ్ర భూ సర్వే చేసి అందరి లెక్కలు సరిచేయడానికి సిద్ధమయింది రాష్ట్ర ప్రభుత్వం. ఇప్పుడు ఈ భూ సర్వేతో అక్రమంగా భూములను కొల్లగొట్టిన భూ బకాసురల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అయితే వీటిని కూడ తారుమారు చేసి తమకు అనుకూలంగా సర్వే ఫలితాన్ని సొంతం చేసుకునేందుకు కొందరు అక్రమణ దారులు కొత్త పద్దతులను ఉపయోగిస్తున్నారు. నిక్కచ్చిగా, నిజాయితీగా సర్వే చేస్తున్న అధికారులపై బురదజల్లి అల్లిబిల్లి కథనాలు వండి వారిస్తున్నారు. అసలు ఇదంతా ఎందుకు చెబుతున్నామనే కథా? మరి అలస్యం ఎందుకు మిగిలినది కూడ చదవండి మరి.

ఆ యువనేస్తంః మహానంది మండలంలో సమగ్ర భూ సర్వే కార్యక్రమం బుధవారం నుండి ప్రారంభమయింది. సర్వే పూర్తిస్థాయిలో జరగక ముందే సర్వే చేస్తున్న డిప్యూటి తహాశీల్దార్‌పై అవాస్తవ కథనాలు ప్రచురితమయ్యాయి. అసలు వివరాల్లోకి వెళ్లితే గుమ్మడికాయల దొంగ అంటే భూజాలు తడుముకున్నట్లు అన్నచందంగా ఓ యువనేత దీని వెనుక ఉండి నడిపిస్తున్నారన్న పుకార్లు మండలమంతా సికార్లు చేస్తున్నాయి. ఆ యువత తండ్రి హయాంలో సంపాదించిన అస్తికి తోడు తన తెలివి తేటలతో అటవీభూములతో పాటు అసైండ్ భూములు సైతం అనకొండలా మింగారని బహిరంగ రహాస్యం అందరికి తెలిసింది. రెండు దశాబ్దాలుగా వాటిని తన సొంత భూములుగా వాడుకుంటూ వాటికి పాసుబుక్కులు సృష్టించి వాటిపై బ్యాంకుల్లో రుణాలు తెప్పించి అప్పన్నంగా వాడుకుంటూ సంఘంలో పెద్ద మనిషిగా చెలామణి అవుతూ పబ్బం గడిపేస్తున్నారు. ఇంతకు చెప్పలేదుకదండి సదరు యువత నేత అధికారపార్టీలో మహానంది మండలంలో ఓ క్రియాశీల సభ్యుడు కావడం గమనార్హం. తన రాజకీయ ప్రత్యర్థిగా భావించే నేత కొడుకు రెవిన్యూ అధికారిగా వచ్చి నిక్కచ్చిగా భూ సర్వే చేస్తుండడంతో తక బొక్కలు ఎక్కడ బయటపడతాయోనన్న అవేదన, అత్మృత అభద్రతా భావంతో సదరు అధికారిపై నిందలు మోసి మానసికి ఇబ్బందులకు గురిచేయాలన్న ప్రయత్నం చేస్తున్నారు.

**నిజాయితీకి మారుపేరుః** నిజాయితీకి మారుపేరుగా ఓ డిప్యూటి తహాశీల్దార్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. తన సర్వీసులో ఎక్కడ పనిచేసినా అవినీతికి అక్రమాలకు తావులేకుండా పెద్దవాడైనా చిన్నవాడైనా న్యాయం ఏవరివైపు ఉంటే వారికి చట్టపరిధిలో చేయాల్సింది చేస్తు ఒకప్రత్యేకమైన పేరు సంపాదించుకున్నారు. తన పర్యవేక్షణలోనే ప్రస్తుతం జగనన్న భూ సర్వే కార్యక్రమం కొనసాగుతుంది. ఈసర్వేలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన భూములపై సమగ్ర సర్వే కొనసాగుతుంది.

**పనికట్టుకొని తప్పుడు ప్రచారాలు:** అయితే నిజాయితీకి మారుపేరుఅయిన డిప్యూటి తహాశీల్దార్‌పై పనికట్టుకొని కొంతమంది పెత్తందారులు ఆయన తప్పుడు కథనాలు రాయిస్తున్నారని మండల వాసులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొన్ని వందల ఎకరాలు కొంతమంది భూ బకాసురుల స్వాధీనంలో ఉన్నాయి. అయితే వాటికి ఎక్కడ ముప్పు వాటిల్లుతుందోనన్న భయంతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అయితే భూములకు సంబంధించిన వివరాలు సమగ్రంగా సర్వే అధికారులతో కొలతలు వేయించి వాస్తంగా



ఏవరైనా భూమి చెందేవిధంగా రికార్డుల్లో నమోదు చేసి అధికారులకు రెవిన్యూశాఖ వారు అప్పగిస్తారు. అయితే సమగ్ర భూ సర్వే ప్రారంభమయిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ఇక్కడ అన్యాయం జరిగిపోతుంది అంటూ కొన్ని పత్రికల్లో వార్తకథనాలు రావడం హాస్యాస్పదంగా మారింది. మహానంది మండలంలో భూ సమగ్ర సర్వే జిల్లా కలెక్టరు సర్వే అధికారులు సంయుక్తంగా సర్వే చేయాలని రైతన్నలు కోరుతున్నారు. ప్రస్తుతం సర్వేచేస్తున్న నిజాయితీ గల అధికారిని తప్పిస్తే తరువాత సర్వేకు వచ్చేవారిని వశం చేసుకొని తమకు అనుకూలంగా మార్చుకొని తాము అక్రమంగా సొంతం చేసుకున్న భూములు తమవద్దనే భద్రపరుచుకోవచ్చన్న దురాలోచనలో ఉన్నారు. నిజంగా అందరు అలోచిస్తున్నట్లు డిప్యూటి తహాశీల్దార్ సర్వే అధికారిగా ఉంటే అక్రమ భూములను బయటకు తీస్తారని ఏవరైనా బయపడుతున్నారా నిజాయితీ గల అధికారి ఉంటే రైతులందరికి లాభమేకదా.

# పెద్ద ఆస్పత్రికి రాజకీయ గ్రహణం..!

**(మొదటి పేజీ తరువాయి ) :** దుకాణాలను హఠాత్తుగా సీజ్ చేశారు. ఎందుకు సీజ్ చేశారు అన్న విషయంపై ఎవరికీ స్పష్టత ఇవ్వలేదు. స్పష్టత ఇవ్వకపోవడం మాట అటుంచితే మరో సంస్థకు మెడికల్ షాపులు కేటాయించేందుకు చర్యలు ప్రారంభించారు. ఒక దశలో 13 లక్షల గుడ్‌విల్‌తో షాపులు కేటాయించేందుకు చర్చలు కూడా జరిగినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం దుకాణాలు నిర్వహిస్తున్న పొదుపు సంఘాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడు వారు చెప్పిన విశేషం ఏంటంటే ఈ మొత్తం వ్యవహారం ఒక ఎంపీ నడుపుతున్నాడని ఆయన పేరుతో సహా వారు మీడియాకు చెప్పారు. ఎంపీ అనుచరులకు షాపులు కేటాయించాలని ఉద్దేశంతో తమను రోడ్డుపాలు చేస్తున్నారంటూ మీడియా ముందు బహిరంగంగా విమర్శలు చేశారు. దీంతో ఆసుపత్రి నిర్వాహకులు ప్రభుత్వ చట్టాల మేరకు పనిచేస్తున్నారా రాజకీయ నాయకులకు అనుకూలంగా దోపిడీ చేస్తున్నారా అన్న చర్చ ప్రారంభమైంది. ఏది ఏమైనా ఎంపీ అనుచరులు సదరు షాపులు దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. వారి ప్రయత్నాలు మీడియాలో కథనాలుగా రావడంతో... పొదుపు సంఘాలతో కలిసి జనం ఛీ కొట్టారు.. నాయకుల తీరుపై దుమ్మెత్తిపోశారు. ఇలాంటి నాయకులా తమ పాలకులు అంటూ మండిపడ్డారు. పేదలకు అందించే ఉచిత వైద్యాన్ని కూడా దోచుకుంటున్నారా ఇలాంటి వారు శవాలను పీకుతున్న రాబందులతో సమానమంటూ బహిరంగంగా విమర్శించారు. అంతగా విమర్శలు వచ్చిన... మీడియాలో కథనాలు వచ్చినా... ప్రజల్లో వ్యతిరేకత వచ్చినా... ఆసుపత్రి అధికారులు మాత్రం తమకు సంబంధం లేదన్న చందంగా షాపుల సీజ్‌ను కొనసాగించారు. ఎంపీ అనుచరులకు షాపులు కేటాయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

బాధితులు ఎమ్మెల్యే హఫీస్ కాని వద్దకు వెళ్లి తమ బాధ చెప్పుకున్నారు. ఆయన కూడా మొదట్లో చిన్నపాటి సమస్యగా భావించారు. అయితే మీడియా కథనాలు ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతను గమనించి స్వయంగా ఆసుపత్రికి వచ్చి ఆసుపత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజ్ చేసిన దుకాణాలకు స్వయంగా తెరిపించారు. ఈ క్రమంలో ఏడి రమేష్ సీజ్ చేయడాన్ని సమర్థించుకునే విధంగా వివరణ ఇచ్చారు. సదరు పొదుపు సంఘం నిర్వహణలో లోపాలు ఉన్నాయని సరైన క్రమంలో అమ్మకాలు జరగడంలేదన్న కారణంతో సూపరింటెండెంట్ నిర్ణయం తీసుకున్నాడని వివరణ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే హఫీస్ ఖాన్ మీ సూపరింటెండ్ నీతిమంతుడా అని నిలదీశాడు. ఆ మాటకు ఏడి రమేష్ బాబు వద్ద ఎలాంటి సమాధానం లేదు. సూపరింటెంట్, ఏడి ఇద్దరు ఆస్పత్రి నిర్వహణలో కీలకమే కావున ఒకరిని అంటే ఇద్దరిని అన్నట్లే అవుతుంది. కాని మా సూపరింటెండెంట్ నీతిమంతుడే అంటూ ఒక్క మాట కూడా చెప్పలేని పరిస్థితిలో ఏడి రమేష్ బాబు ఉన్నాడా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఏది ఏమైనా ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహంతో సీట్ చేసిన దుకాణాలను తెరిపించి లోపల నుంచి తీసుకెళ్లిన కంప్యూటర్‌లను తెప్పించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పొదుపు సంఘాలలో 20 వేల మంది సభ్యులు ఉన్నారని ఈ దుకాణంలో వచ్చే ఆదాయం అంతమందికి పంచబడుతుందని ఇప్పుడు ఈ దుకాణాన్ని సీజ్ చేస్తూ సదరు మహిళలందరూ అన్యాయమైపోతారని ఎమ్మెల్యే వివరించారు. కాగా ప్రస్తుతానికి వివాదం కొంత వరకే శాంతించింది. ఇచ్చిన కమిట్‌మెంట్ వచ్చే లాభం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ వివాదాన్ని మరో కోణంలో రెచ్చగొట్టే అవకాశం ఉంది. కావున ఈ విషయంలో జిల్లా యంత్రాంగం లేదా ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీలు జోక్యం చేసుకుని వివాదాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అది ఆస్పత్రి పరువు, పాలనా వ్యవస్థ మర్యాద కాపాడటమే.

## మహిళా టీచర్లకు భద్రత కల్పించాలి

**కోసిగి, జూన్ 29, ప్రభాతవార్త :** కోసిగి మండలంలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా టీచర్లకు ప్రభుత్వం భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపిటిఎఫ్) నాయకులు డిమాండ్ చేసారు.. ఇటీవల కోసిగిలోని ఓ ప్రాథమిక పాఠశాల మహిళా టీచర్ పట్ల గ్రామానికి చెందిన యువకుడు అసభ్యకరంగా ప్రవర్థించి మహిళా టీచర్‌పై అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటనపై ఏపిటిఎఫ్ నాయకులు స్పందించారు.. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షులు భీమ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాజమౌళిలు మాట్లాడుతూ జిల్లాకు మారుమూల ప్రాంతమైన కోసిగిలో ఉపాధ్యాయ వృత్తిని చేసేందుకు చాలా మంది ఇష్టపడడం లేదని, అయితే ఈలాంటి క్లిష్టతరమైన ప్రాంతంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించేందుకు ముందుకు వస్తున్న మహిళా టీచర్ల పట్ల కొంత మంది అసభ్యకరంగా ప్రవర్థించడం సరికాదన్నారు. కోసిగి చరిత్రలోనే ఈలాంటి సంఘటన చోటు చేసుకోవడం దారుణమన్నారు.. ప్రభుత్వం ఈలాంటి చర్యలకు పాల్పడిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించి మహిళా టీచర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేసారు.. లేనిచో ఏపిటిఎఫ్ తరుపున జిల్లా స్థాయిలో మహిళా ఉపాధ్యాయులతో కలసి భారీ ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు, గురుస్వామి, ప్రధాన కార్యదర్శి ఓబులేసు, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు..

## కర్ణాటక మద్యం స్వాధీనం

**మాధవరం(మంత్రాలయం),జూన్ 29,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మాధవరం సర్కిల్ వద్ద కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు గురువారం విలేకరులకు తెలిపారు. వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం, మెహబూబ్ నగర్ జిల్లా, తుమ్మకుంట తాండ గ్రామానికి సుగాలి పత్‌లావత్ కుమార్ అనేవ్యక్తి కర్ణాటక మద్యం తీసుకువస్తున్నారన్న సమాచారంతో తమ సిబ్బందితో తనిఖీ చేయించి మద్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. ఈ వ్యక్తి వద్దనుండి 384 ఒరిజినల్ ఛాయిస్ టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వీరివెంట సిబ్బంది వీరేష్ తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడుకలు

**తుగ్గలి, జూన్ 29, ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఉదయాన్నే మసీదుల్లోకి వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బక్రీద్ పండుగ వేడుకలను జరుపుకున్నారు. నూతన దుస్తులు ధరించి చిన్నలు, పెద్దలు మసీదుల దగ్గరకు వెళ్లి త్యాగాలకు, సహనానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లిం సోదరులంతా కలిసి అల్లాపై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ త్యాగాలకు మారుపేరుగా ఈ పర్వదినాన్ని ప్రత్యేక ప్రార్థనలతో జరుపుకున్నారు. మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్, రాంపురం సర్పంచ్ కమల్ భాష, రామలింగయ్య పల్లెలో నబీరసూల్, బొందిమడుగులలో మెహబూబ్ భాషలతో పాటు మరిన్ని గ్రామాలలో ముస్లింలు బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్ వేడుకలు ప్రజల మధ్య శాంతిసామరస్యాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. త్యాగానికి గుర్తుగా నిర్వహించుకునే ఈ పండుగ సమాజంలోని వివిధ వర్గాల మధ్య జాలి, దయ, కరుణ అనే స్ఫూర్తిని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వారు ఒకరినొకరు అలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా బక్రీద్ పర్వదిన వేడుకలు

**మంత్రాలయం, జూన్ 29, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలంలోని అన్ని గ్రామాల్లో బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల సందర్భంగా ముస్లిం సోదరులు ఉదయం నుండే ప్రత్యేక ప్రార్థనల్లో గడిపారు. ముఖ్యంగా మంత్రాలయంలో స్థానిక జామియా మసీదు నుండి ఈద్గా వరకు ర్యాలీగా వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం ఇమాం బందేనవాజ్ బక్రీద్ పర్వదిన విశిష్టతను తెలియజేశారు. త్యాగానికి ప్రతీకగా ఈ బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటారని తమ సందేశంలో పేర్కొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని మాధవరం, రాంపురం, కాచాపురం, రచ్చుమర్రి, మాలపల్లి, పరమాన్‌దొడ్డి, సింగరాజనహళ్ళి, వగరూరు. వి. తిమ్మాపురం, బూదూరు, సూగూరు, చిలకలడోణ, కల్లుదేవకుంట, చెట్నహళ్ళి తదితర గ్రామాల్లో బక్రీద్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి.

## ఉపాధి పనులు కల్పించాలి

**హాలహర్వి, జూన్ 29, ప్రభాతవార్త :** మండలంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని ఏపిఓ శ్రీనివాసులు అన్నారు. ఉపాధి హామీ పనుల కల్పనపై గురువారం బాపురం, హాలహర్వి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వందరోజుల పని కల్పించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మండలంలో 10వేల జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. 7500మంది పనులకు వస్తున్నారని తెలిపారు. కావున ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. ఉపాధి పనులకు వచ్చే ప్రతి కూలీలకు రోజుకు రూ. 275లు వేతనం అందుతుందన్నారు. ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగితే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు పాల్గొన్నారు.

## దేవాలయాల్లో ఏకాదశి పూజలు

**హాలహర్వి, జూన్ 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గూళ్యం గాదిలింగేశ్వర స్వామి, బాపురం బసవేశ్వర స్వామి, క్షేత్రగుడి ఆంజనేయస్వామి, విరుపాపురం బలగోటేశ్వర స్వామి దేవాలయాల్లో గురువారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా స్వాముల వారికి ఉదయం ఆకుపూజలు, పంచామృతాభిషేకం, పాలాభిషేకం, గణపతి పూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వాముల వారికి మంగళారతులు, నందికోలు సేవ, పల్లికి ఊరేగింపు తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని గాదిలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ పూజారిలు తెలిపారు. పూజా కార్యక్రమాలకు కర్ణాటక నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

**హొళగుంద, జూన్ 29, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన హొళగుందలో స్థానిక బస్టాండ్ వద్దనున్న కన్నడ స్కూల్‌లో ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ బళ్లారి వారి ఆద్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచితం కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ తిప్పయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటలకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్యశిబిరంలో 70మందికి కంటి వైద్య నిపుణులు కంటి పరీక్షలు చేయగా వారిలో 30మందికి కంటి ఆపరేషన్లు చేయాలని వైద్యులు తెలిపారు. 30మందిని బళ్లారిలోని ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మిగతా 40మందికి కంటి అద్దాలు తీసుకోవాలని సూచించారు. కంటి ఆపరేషన్‌కు వెళ్లేవారు తనను సంప్రదించాలని డాక్టర్ తిప్పయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ మహంతేష్, ఆప్టికల్ టెక్నీషియన్ మల్లికార్జున, విజన్ టెక్నీషియన్ జయలక్ష్మి, జెపి సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## “భక్తి శ్రద్ధలతో భగవద్గీత పారాయణం ..’

**కొలిమిగుండ్ల, జూన్ 29, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో గురువారం భగవద్గీత పారాయణం కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని స్వర్ణగౌరి, సూర్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పంచామృత అభిశేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి, ప్రసాద వితరణ గావించారు. అనంతరం భగవద్గీత 18అధ్యాయాలు సంపూర్ణ పారాయణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరసింహప్రసాదు, ప్రముఖ అధ్యాత్మిక ప్రవచకులు వైవిఎస్ నారాయణరెడ్డి, కదిరెడ్డి, వెంకటయ్య, బయపురెడ్డి, నాగేశ్వరరెడ్డి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీరవోలు నూతన బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

**– మాజీ జెడ్పీటిసి పుల్యాల నాగిరెడ్డి**

**పగిడ్యాల, జూన్ 29, ప్రభాతవార్త :** కెసి కెనాల్‌పై బీరవోలు వద్ద నూతన బ్రిడ్జి నిర్మాణానికి మాజీ జెడ్పీటిసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాల శేషన్న గురువారం భూమిపూజ చేశారు. ప్రజలసౌకర్యార్థం మాజీ మంత్రి బైరెడ్డి శేషశయనారెడ్డి హాయాంలో ప్రజల సౌకర్యార్థం కెసి కెనాల్‌పై బీరవోలు వద్ద బ్రిడ్జినిర్మాణాన్ని 10-4-984లో ప్రారంభించారు. నేడు శిథిలావస్థకు చేరుకోవడంతో స్పందించి మాజీ మంత్రి బైరెడ్డి శేషశయనారెడ్డి మనుమడు శాప్ చైర్మెన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సిఎం దృష్టికితీసుకెళ్లి నూతన బ్రిడ్జినిర్మాణానికి రూ. 1.50కోట్లు. అదేవిధంగా ముచ్చుమర్రి వద్ద కెసికెనాల్‌పై నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ. 1.46కోట్లు మంజూరు చేయించారు. దీంతో పగిడ్యాల మాజీ జెడ్పీటీసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాల శేషన్న గురువారం బీరవోలువద్ద కెసికెనాల్‌పై నూతన బ్రిడ్జినిర్మాణానికి భూమిపూజ చేశారు. త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నూతన బ్రిడ్జినిర్మాణానికి భూమిపూజ చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాల శేషన్న, లస్కర్ కురుమన్న, భూషిరెడ్డి, బొబ్బిటి నాగేశ్వరెడ్డి, పల్లె రామకృష్ణ, మోక్షేశ్వరెడ్డి, బుజ్జి, గుంపుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మద్ ప్రవక్త భోదించిన.. అందరు అనుసరించాలి..!

**– మండలంలో ఘనంగా బక్రీద్ వేడుకలు**

**హొళగుంద, జూన్ 29, ప్రభాతవార్త :** బక్రీద్ పండుగ త్యాగం, విశ్వాసానికి ప్రతీక అని మహమ్మద్ ప్రవక్త బోధించిన సమైఖ్యతను, సహోదరభావాన్ని అందరు అనుసరించాలని ముస్లిం మత పెద్దలు మౌలి హబీబుల్లా, మౌలి సమీముల్లాలు అన్నారు. గురువారం మండల కేంద్రమైన హొళగుందతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లిం సోదరులు, పిల్లలు, మహిళలు బక్రీద్ పండుగ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పెద్దమసీదు నుండి ముస్లిం సోదరులు అల్లాను ప్రార్థిస్తూ పురవీధుల్లో తిరుగుతూ ఆయా ఈద్గలకు తరలివెళ్లి నమాజ్, ప్రార్థనలు చేశారు. హలేహదీస్ ఈద్గలో మౌలి హబీబుల్లా ముస్లిం సోదరులకు ప్రార్థనలు చేయించారు. మౌలి సమీముల్లా ఈద్గలో ముస్లింలనుద్దేశించి ఉపన్యసిస్తూ దేశ పౌరులందరు కలిసిమెలసి ఉండాలని దేశ ఐక్యత కోసం అందరు ఒకతాటిపై నిలవాలని కోరారు. ప్రతి మనిషి స్వార్థం విడనాడి పేద, వితంతు, వృద్ధులు, బలహీనుల పట్ల ప్రతి ముస్లిం సోదరుడు విధేయుడిగా ఉండి మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. ముస్లిం సోదరులు ఇబ్రహీం ప్రవక్త ఇస్మాయిల్ ప్రవక్త అడుగుజాడల్లో నడవాలన్నారు. ఖురాన్ మరియు దైవ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహుఅలైహి వ సల్లం చెప్పిన సూత్రాలను తప్పక పాటించాలని ప్రపంచ శాంతి కోసం అందరు నడుం బిగించాలని కోరారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండి దేశ, ప్రపంచ ప్రజలందరు సుఖసంతోషాలతో ఆయురారోగ్యంగా ఉండాలని ప్రార్థించారు. ఈద్గ నమాజ్‌లో భారీ సంఖ్యలో ముస్లిం మహిళా సోదరిణులు పాల్గొన్నారు. హిందూ, ముస్లిం సోదరులు ఒకరినొకరు అలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే శాలి మసీద్ రాజనగర్ మరియు పబ్లిక్ జమాత్ ఆద్వర్యంలో బక్రీద్ పండుగ ఘనంగా జరిగింది. బక్రీద్ పండుగ సందర్బంగా ఎలాంటి ఘర్షణలు జరుగకుండ ఉండడానికి పత్తికొండ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాసులు, నరేంద్రలు భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

## సాగు సలహాలకు టోల్‌ఫ్రీ

**– అందుబాటులోకి 155251నంబర్**

**– నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం**

**హాలహర్వి, జూన్ 29, ప్రభాతవార్త :** రైతుసంక్షేమమే ధ్యేయంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రైతులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశ్యంతో గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ఇతర సంక్షేమ పథకాలు అందిస్తోంది. దళారుల బారిన పడకుండ ప్రభుత్వమే ఆర్‌బికెల ద్వారా మద్దతు ధర చెల్లించి పంటలు కొనుగోలు చేస్తుంది. సాగులో మెలకువలు తెలుసుకునేందుకు ఆర్‌బికెలో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ 155251నంబరును అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నంబరుకు ఫోన్ చేసి ఎప్పటికప్పుడు సాగు సలహాలు, సూచనలు పొందవచ్చు. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 104 రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటికే అన్ని రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులు, పురుగుల మందులు తదితర సంక్షేమ పథకాలు వ్యవసాయాధికారులు అందిస్తోన్నారు. దీంతో వ్యవసాయ విజ్ఞాన పుస్తకాలు, రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. దీంతో పాటు టోల్ ఫ్రీ నంబరు కూడా ఏర్పాటు చేశారు.

టోల్‌ఫ్రీ నంబరు ద్వారా ప్రయోజనాలు :- రైతులు టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సాగు సమాచారం, సందేహాల నివృత్తి కోసం నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో మాట్లాడవచ్చు. వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు మార్కెటింగ్ సౌకర్యంపై వివరాలు పొందవచ్చు. ప్రతిరోజు ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు టోల్‌ఫ్రీ నంబరు పనిచేస్తుంది. రైతులు అడిగిన ప్రశ్నల ఆధారంగా వారి ఫోన్‌కు సమాచారం చేరవేస్తారు. 24గంటల్లో సమస్యకు పరిష్కారం లభిస్తుంది. వాతావరణానికి అనుగుణంగా ఎలాంటి పంటలు వేసుకోవాలి, విత్తనాల ఎంపిక, ఎరువులు, పురుగుల మందుల వినియోగం, సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తారు. వ్యవసాయ అనుబంధ రంగాల రైతులు కూడా ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చు. సేవలు

**సద్వినియోగం చేసుకోండి : శివశంకర్, ఏఓ**

రైతులకు సాగులో సలహాలు, సూచనలు అందించేందుకు వారి సమస్యలు పరిష్కరించేందుకు టోల్‌ఫ్రీ నంబరు 155251ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నంబరుకు ఫోన్ చేసి నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో మాట్లాడి సలహాలు, సూచనలు పొందవచ్చు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

## శ్రీశైలం మల్లన్న సన్నిదిలో ఏమ్మెల్యే శిల్పా

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్29, ప్రబాతవార్త :** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను గురువారంనాడు శ్రీశైలం నియేజవర్గం శాసన సభ్యులు శిల్పాచక్రపాణిరెడ్డి మల్లన్న దర్శనార్థమై శ్రీశైలం ఆలయం వద్దకు చేరుకునా న్రు. వారికి ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయబద్ధంగా ఆలయ సహాయ కార్యనిర్వహణాదికారి హరిదాసు అర్చక స్వాములు సాదర స్వాగతం పలికారు. తదనంతరం వారు శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో అర్చకస్వాములు, వేదపండింతులు వేదశీర్వచనాలు వల్లించి తీర్ధ ప్రసాదాలు అందించారు. తదుపరి ఆలయ సహాయ కార్యనిర్వహణాదికారి హరిదాసు శేషవస్త్రలతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను అందజేసి శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటంను భహుకరించారు.

## నాడు బలిదానము-నేడు రక్తదానము-కలెక్టరు

**నంద్యాల, జూన్ 29, ప్రభాతవార్తప్రతినిధి :** భక్తి పరీక్ష కోసం నాడు ఇబ్రహీం ప్రవక్త నాడు బలిదానమునకు సిద్ధము కాగా నేడు ముస్లీంలు ఇతరల ప్రాణాలు కాపాడాటానికి రక్త దానము చేయడము మరో త్యాగాలకు ప్రతారూపమని జిల్లా కలెక్టరు మనజీరజిలానిసామూన్ అన్నారు. బక్రాద్ పండుగను పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీ అద్వర్యంలో స్థానిక బీమవరము రోడ్డులో ఉన్న పాత ఈదుగావద్ద ఏర్నాట్లు చేసిన రక్తదాన శిబిరము జిల్లా కలెక్టరు మనజీరజిలానిసామూన్ ప్రారంబించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాకుబాష, జిల్లా యస్‌పి రఘువీరారెడ్డివైద్యవిదానపరిషత్ కోఅర్డిటనేరుజప్రూల్లా, నంద్యాల ప్రభుత్వం అసుపత్రి బ్లడ్ బా ్యంకుమెడికల్‌అఫీసరు డాక్టరు లింగేశ్వరరావు, రెడ్ క్రాస కోశాదికారి నాగేశ్వరరావు, క్యావర్డ సభ్యులు ఉస్మాన్‌బాష, నంద్యాల మండల బ్రాంచీవైస్‌చైర్మన సోహెల ,డిఎఫ్‌ఓ రాజునయక రెడ్‌క్రాస మెంబర్లు సద్దాం, బాబా, దాదామరళీ, వుశేని, పాల్గొన్నారు. ఈసందర్బముగా కలెక్టరు మాట్లాడుతూ నాడు దేవుడు ఇబ్రమీం ప్రవక్త భక్తిని పరీక్షంచదానికి కుమారుని బలాదానము చేయాలని కోరగా అందుకు సిద్ధమై బలి అర్పిస్తుండగా దూత ప్రత్యక్షమైన భక్తిని మెచ్చిన దేవుడుకుమారుకిని బదులగా పొట్టెలను బలి అర్పించాలని అదేశించాడు, అలాగే బక్రీద్ రోజున ముస్తీం యువకులు రక్తదానము చేయడము కూడా త్యాగాలకు ప్రతిరూపమని చెప్పారు.

## ముస్లిం సోదరులకు ఈద్‌ముబారక్

**– మాజీ సర ్పంచ్ బీసీ రాజారెడ్డి**

**బనగానపల్లెరూరల్, జూన్29, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని బీసీ గుర్రెడ్డి కాంప్లెక్స్ ఆవరణంలో గల బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి గురువారం ఆయన కార్యాలయం వద్ద పట్టణంలోని ముస్లిం సోదరులందరికి బక్రీద్(ఈద్‌ముబారక్) పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగా బనగానపల్లె పట్టణం మరియు మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు మర్యాదపూర్వకంగా బీసీ రాజారెడ్డిని కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా వారు బీసీ రాజారెడ్డి కార్యాలయానికి చేరుకుని ఆయనను పూలమాలతో సత్కరించి కేక్‌కట్ చేయించి పండుగ సంబరాలను జరుపుకున్నారు. అనంతరం బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకుంటున్న బక్రీద్ పండుగ సమస్త మానవళికి శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ మీకు మీ కుటుంబ సభ్యులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. ఆ అల్ల దయ వల్ల ముస్లిం సోదరులందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ బాషా, లాయర్ నాగేంద్రారెడ్డి, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

**నందికొట్కూరు, జూన్ 29, ప్రభాతవార్త:** త్యాగ నిరతికి, ధర్మ నిబద్దతకి ప్రతీక నేడు అందరి ఐక్యతకు కరుణకి విశ్వాసానికి నిదర్శరంగా బక్రద్ పండుగ వేడుకలను ముస్లీంలు ఘనంగా నిర్వహించారు. గురువారం బక్రీద్ ను పురష్కారించుకొని బస్టాండు దగ్గర ఉన్న ఈద్గా, అల్లూరు రోడ్డులో గల ఈద్గా వద్ద ముస్లీంలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకలలో నియోజకవర్గం ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి సంఘనలు జరగకుండా ఎస్సై ఎన్.వి.రమణ గట్టి భంధోబస్తు నిర్వహించారు.

## వేడుకలను ఘనంగా నిర్వహించుకుందాం

**పరమాన్‌దొడ్డి(మంత్రాలయం), జూన్ 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పరమాన్‌దొడ్డి గ్రామంలో ఉన్న ఎస్ఎంకెవి పాఠశాల యాభై సంవత స్రాల వేడుకలను ఘన ంగా నిర్వహించుకుందామని పాఠశాల ఇంఛార్జ్ లక్ష్మికాంత్ పిలుపునిచ్చారు. గురువారం ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన 1995-96వ సంవత్సరంలో పదవ తరగతి పూర్వ విద్యార్థుల కలయిక వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మికాంత్ మాట్లాడుతూ 27 సంవత స్రాల తరువాత విద్యార్థులు కలుసుకోవడం చాలా మంచిదన్నారు. వీరు చదివిన సమాయాలలోని తీపిగుర్తులను మననం చేసుకున్నారు. వారికి చదువు నేర్పిన గురువులను దుశ్శాలువా, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి మన అందరం సహకరించాలని తోటి సహచారులను కోరారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు ప్రస్తుతం వివిధ రకాల ఉన్నత స్థితిలో ఉండడం గర్వకారణమన్నారు. కాబట్టి వచ్చే సంవత స్రం జూన్ 24వ తారీఖున పాఠశాల ఆవిర్భవించి 50 సంవత స్రాల పూర్తి కావస్తున్నందున ఈ వేడులకను అందరం కలిసి ఘనంగా నిర్వహించుదామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు లక్ష్మిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామ్మూర్తి, జానకిరామిరెడ్డి, రంగన్న, కేశవరెడ్డి, ఎన్‌టి ఈరన్న, సర్పంచ్ భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ సద్గురు కాశిరెడ్డి నాయన 18వ వార్షికోత్సవం

**తుగ్గలి, జూన్ 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో శ్రీశ్రీ సద్గురు కాశిరెడ్డి నాయన 18వ వార్షికోత్స వ మహోత్స వ కార్యక్రమం గురువారం ఉదయం 7గంటల నుండి నేడు శుక్రవారం వరకు శ్రీ గణపతి పూజ, శ్రీ లక్ష్మి నరసింహ స్వామి, పూజ శ్రీ దత్తాత్రేయ స్వామి, పూజశ్రీ అన్నపూర్ణేశ్వరి, పూజ శ్రీ కాశినాయనస్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామపెద్దలు, ప్రజలు తెలిపారు. దీంతో కాశిరెడ్డి నాయన 18వ వార్షికోత్స వ మహోత్స వ కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారి కృపలకు పాత్రులు కావాలని కోరారు. అలాగే కాశిరెడ్డి నాయన 18వ వార్షికోత్స వం సందర్భంగా రాత్రి రాంపల్లి శీను వారి చెక్కభజన బృందం గజ్జల పూజా ఉత్స వం నిర్వహించడం జరుగుతుందని అలాగే ఢీ డాన్స్ పోటీలను నిర్వహిందచం జరుగుతుందన్నారు. ఢీ కార్యక్రమానికి దుబ్బల నరసన్న కుమారుడు సీనయ్య రూ. లక్ష బహుమతిని ఇవ్వడం జరిగిందని నిర్వాహకులు, గ్రామపెద్దలు తెలిపారు.

## అనారోగ్యంతో సిపిఐ నాయకుడు మృతి

**– నివాళులర్పించిన ప్రముఖులు, నాయకులు**

**మంత్రాలయం, జూన్ 29, ప్రభాతవార్త:** నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో సిపిఐ నాయకుడు డిఎం యల్లప్ప అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న వైసిపి మండల కన్వీనర్ గుర్రెడ్డి భీంరెడ్డి యల్లప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. యల్లప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఎల్ఏ వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కుటుంబ సభ్యులకు నాయకులు జనార్ధన్‌రెడ్డి, వెంకటరెడ్డి చేతులమీదుగా రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా మండల కన్వీనర్ భీంరెడ్డి కూడా రూ. 10,000 ఆర్థిక సహాయం చేశారు. మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ భీమయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజినేయులు, భాస్కర్ యాదవ్, రంగన్న, థామస్ తదితరులు పాల్గొని యల్లప్ప కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. యల్లప్ప మూడుమార్లు సిపిఐ మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికై ప్రజలకు తన విలువైన సేవలు అందించారు.

## ప్రజలపై భారం పడే విద్యుత్ చార్జీలను ఉపసంహ్మరించుకోవాలి

**నందికొట్కూరు, 29, ప్రభాతవార్త:** ప్రజలపై భారం పడే విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహ్మరించుకోవాలని సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమొక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్తానిక పార్టీ కార్యాలయంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కార్యదర్శి వై. నరసింహ్మలు మాట్లాడుతు ఈ నెల 30న ఉభయ జిల్లా వ్యాప్తంగా విధుయత్ కార్యాలయం ముందు జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీల భారాన్ని ఉపసంహ్మరించుకోవాలని, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడు ఆపాలని, స్మార్ట్ మీటర్ల పేరుతో లక్షల కోట్లు ప్రజలపై భారాలు వేసే విద్యుత్ సంస్కరణ బిల్లు 2020 రద్దు చేయాలని, 18లక్షల వ్యయంతో పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని కోరారు. 1948 నుండి విద్యుత్ కంపెనీ చట్టం విద్యుత్ బోర్డు ఏర్పడి నో లాస్ లో గేయన్ విధానంతో ప్రజలకు విద్యుత్ సౌకర్యాలు సేవాఆ దృక్పథంతో అంధించాలని మన దేశ రాజ్యాంగ నిర్మాతలు సేవకులైన పాలకులు ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. కావున విద్యుత్ చార్జీల కోసం జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియూ జిల్లా అధ్యక్షులు వై. ఆశీర్వాదం, జిల్లా కార్యదర్శిఈ అరుణ్‌కుమార్, భారత రైతు కూలి సంఘం నాయకులు వేంకటేశ్వర్లు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా స్వామివారికి సహస్ర ఘటాభిషేకం

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్29, ప్రభాతవార్త :**

శ్రీగిరి క్షేత్రంలో తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకోని గురువారంనాడు శ్రీమల్లికార్జునస్వామివారికి శాస్త్రోక్తంగా సహస్ర ఘటాబిషేకం నిర్వహించడం జరిగింది. సకాలంలో తగినంత వర్షాలు కురిసి పంటలు బాగా పండి రాష్ట్రం సశ్యశ్యామలంగా ఉండాలనే సంకల్పంతో తొలి ఏకాదశి రోజున కృష్ణవేణి నదీజలాలలొతోనూ ఆలయప్రాంగణములోని మల్లికాగుండ జలంతోనూ ఈ అభిషేకం నిర్వహించడం జరిగింది. అదే విధంగా అమ్మవారికి ప్రాత:కాలపూజలు, మహమంగళహారతి జరిపించబడ్డాయి. నిత్యపూజాదికాల అనంతరం ఈ ఉదయం ముందుగా అర్చకస్వాములు ఘటాబిషేక సంకల్పాన్ని పఠించారు. ఈ సంకల్పంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, రాష్ట్రం సశ్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలని, అతివృష్టి, అనావృష్టి నివారించబడాలని, రాష్ట్రంలో చెరువులు, జలశయాలలోకి సమృద్ధిగా నీరు చేరాలని జనులందరికి సుఖసంతోషాలు కలగాలని పేర్కోనడం జరిగింది. సంకల్పం తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహగణపతి పూజ జరిపించబడింది. అనంతరం అర్చకస్వాములు పాతాళగంగ వద్ద కృష్ణవేణినదీమతల్లికి పూజాదికాలు జరిపి కలశాలలో కృష్ణవేణినదీజలాలను తీసుకురావడం జరిగింది. ఈ ఘటాభిషేకం జరుగుతున్నంతసేపు నిరంతరం అర్చకస్వాములు రుద్రమంత్రాలను పఠించడం జరిగింది. ఘటాభిషేకం పూర్తయిన తరువాత మహనివేదన, నిరాజన, మంత్రపుష్ప కార్యక్రమాలు జరిపించబడ్డాయి. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు దేవదాయశాఖమంత్రివర్యులు కొట్టు సత్యనారాయణ, స్థానిక శాసన సభ్యులు శిల్పాచక్రపాణిరెడ్డి, దేవదాయశాఖ కమీషనర్ ఎస్. సత్యనారాయణ, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర ్వహణాదికారి ఎస్. లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

## తొలి ఏకాదశితో కిక్కిరిసిన దేవాలయాలు

**దేవనకొండ, జూన్ 29, ప్రభాతవార్త :** తొలి ఏకాదశి సందర్భంగా దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేయడంతో దేవాలయాలు కిక్కిరిసిపోయాయి. మండల కేంద్రమైన శంకర దేవాలయంలో ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు చేశారు. అలాగే గద్దెరాళ్ల గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ అవ్వ దర్శనం కోసం భక్తాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి వారి మొక్కులు తీర్చుకున్నారు. కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో వెలసిన శ్రీ కౌలుట్ల చెన్నకేశవ స్వామి సన్నిధిలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో ఎస్ఐ భూపాలుడు ప్రత్యేక పూజలు చేశారు.

## న్యూ క్యాటగిరి బండలాగుడు పోటీలు

**తుగ్గలి, జూన్ 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో శ్రీశ్రీ సద్గురు కాశిరెడ్డి నాయన 18వ వార్షికోత్స వ మహోత్స వం సందర్భంగా 30వ తేదీన రాంపల్లి గ్రామ ప్రజల ఆద్వర్యంలో శ్రీ వాల్మీకి దేవాలయం నందు న్యూ క్యాటగిరి విభాగంలో బండలాగుడు పోటీలను నిర్వహించడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ బండలాగుడు పోటీలలో మొదటి బహుమతి రూ. 40వేలు దాత మద్దికెర చిన్న నాగన్న కుమారుడు ఓబులేషు, 2వ బహుమతి రూ. 30వేలు దాతలు హనుమంతు, శ్రీరాములు, రాజు, రంగస్వామి, 3వ బహుమతి రూ. 20వేలు దాతలు చిట్యాల రాజు, రవి, చాకలి పెద్ద రంగన్న, చాకలి నడిపి రంగన్న, 4వ బహుమతి రూ. 10వేలు దాతలు మల్లికార్జునగౌడ్, 5వ బహుమతి రూ. 5వేలు దాత రామకృష్ణ శభాష్‌పురంలు పెద్దల సమక్షంలో బహుమతులను అందచేయడం జరుగుతుందని తెలిపారు. దీంతో నేటిలోగ ఆసక్తి గల వారు 9440097301, 9491413542, 8985471384లను సంప్రదించి ఎంట్రీ ఫీజు రూ. 500లు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు, గ్రామప్రజలు తెలిపారు.

## ఘనంగా బక్రీద్ వేడుకలు

**దేవనకొండ, జూన్ 29, ప్రభాతవార్త :** మండలంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులు ర్యాలీగా వెళ్లి ఈద్గల దగ్గర ప్రార్థనలు నిర్వహించారు. త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్ పండుగ యొక్క ప్రాముఖ్యతను మత పెద్దలు చదివి వినిపించారు. ముస్లిం సోదరులు చిన్నా, పెద్ద తేడా లేకుండ ఒకరినొకరు అలింగనం చేసుకుని ఈద్-ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

**హాలహర్వి, జూన్ 29, ప్రభాతవార్త :** మండలంలోని చింతకుంట, కామినహాల్, గూళ్యం తదితర గ్రామాల్లో గురువారం బక్రీద్ వేడుకలు ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా ముస్లింలు ఈద్గ దగ్గర ప్రత్యేక నమాజ్, ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముస్లిం మత పెద్ద షేక్షావలి మాట్లాడుతూ త్యాగాలకు ప్రతీకగా ఈ బక్రీద్ వేడుకలు జరుపుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉంటే భగవంతుడు సుఖసంతోషాలు కలిగిస్తాడని ఆయన తెలిపారు. అనంతరం బక్రీద్ వేడుకల్లో భాగంగా ర్యాలీ నిర్వహించి దైవ సందేశాన్ని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చింతకుంట సర్పంచ్ సద్దాంహుస్సేన్, ముస్లిం మత పెద్దలు మస్తాన్‌భాషా, అక్బర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాలకు ప్రతిరూపం బక్రీద్

**పగిడ్యాల, జూన్ 29, ప్రభాతవార్త :** త్యాగాలకు ప్రతిరూపం బక్రీద్ అనీ ముస్లీం మతపెద్దలు అన్నారు. బక్రీద్ పండుగను పురష్కరించుకుని గురువారం మండలంలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి, బీరవోలు, పగిడ్యాల, సంకిరేణిపల్లె, లక్ష్మాపురం, ప్రాతకోట, గణపురం గ్రామాల్లో ముస్లీంలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయాగ్రామశివారులో ఉన్న ఈద్గాలవద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా జంతువులను జుభాచేసి పేదలకు పంపిణీ చేశారు. అనంతరం ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు కురాన్ బక్రీద్ విశిష్టతను వివరించారు.

# కంపు కొట్టుతున్న అమడాల-కనిపించని స్వచ్ఛబారత్?

**కోవెలకుంట్ల, జూన్ 29, ప్రభాతవార్త**
పల్లెలో పరిశుభ్రంగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా స్వచ్ఛబారత్ పేరుతో కోట్లు ఖర్చు చేస్తున్నాయి. కాని చాలా గ్రామాల్లో స్వచ్ఛబారత్ కనుచూపు మేరలో కనిపించక పోవడము పల్లెలో పచ్చదమునకు బదలు మురికి ,చెత్త విచ్చలవిడిగా కనిపిస్తుంది. అలాంటి పల్లెకు ఉదామరణగా అమడాలను చూపించవచ్చు. మండల కేం ద్రానికి కూత వేటు దూరములో అమడాల గ్రామం ఉంది. ఈ గ్రామంలో అదికముగా రైతులు, వ్యవసాయముతో పాటు పాడి పరిశ్రములో మేటి ఉంటారు. అలాంటి గ్రామము చెత్త, మురికి నీటితో కంపు కొట్టుతున్నది. స్వచ్ఛ బారత్ పేరుతో ప్రభుత్వాలు కోట్లు ఖర్చు చేస్తునా న్నమని గొప్పలు చెబుతున్నారు. మరి ఈ అమడాల్లో స్వచ్ఛ బారత్ ఎక్కడ ఎందుకు కనిపించ లేదనే విమర్శలున్నాయి. ముఖ్యంగా గ్రామంలో తెలుగు పేటకు వెల్లాలంటే ముక్కు మైసకుని వెల్లాల్సిన పరిస్థితి దాపురించింది. గ్రామాని చెందిన చెత్త, మురికి మొత్త_ం అక్కడే నిల్వ ఉండటముతో తెలుగు పేట కంపు కొట్టుతుంది. ముఖ్యంగా గ్రామానికి చెందిన 50శాతము మంది అదే రస్తాలో వెల్లాలి. అంత ఎందుకు గ్రామానికి చెందిన సర్పంచు కూడా అదే రస్తాలో నిత్యము వెళ్లుతు వస్తు ఉంటారు కాని అ కంపు గురించి ఏ నాడు పట్టించుకోక పోవడము చాలా బాదాకరము. అసలే వర్షా కాలం దాని తోడు మురికి, చెత్త ఇలా ఉంటే అక్కడ నివాసము ఉంటే కాలనీ వాసులు పరిస్తితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ మురికి చెత్తతో కాలనీ వాసులకు డెంగ్యూ, మలేరియా, టైఫాయిండ్ లాంటి వ్యాదులు ప్రభలే ప్రమాదము ఉందని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు.



ఇప్పటికైన అదికారులు స్పందించి తెలుగు పేట ప్రజలను వ్యాదుల బారీన పడకుండా కాపాడాలని కోరుతున్నారు.

## భగవంతునిపై విశ్వాసానికి ప్రతీక బక్రీద్

**నందవరం, జూన్ 29, ప్రభాతవార్తః** భగవంతునిపై విశ్వాసానికి ప్రతీకకు బక్రీదు పండుగ జరుపుకోవడం ముస్లీంల అనవాయితీ. సమత, మమతలు నింపే పండుగను జరుపుకునేందుకు ముస్లీంలు గురువారం సన్నద్ధమయ్యారు. మండల కేంద్రమైన నందవరంతో పాటు మాచాపురం, ఇబ్రహింపురం, కైరవాడి, నాగలదినె న్న, సోమలగూడూరు, ముగతి, హాల్వహరి గ్రామాల్లో బక్రీద్ సందడి నెలకొంది. ముస్లీంలు బక్రీద్ పండుగను ఇస్లాం క్యాలెండర్ ప్రకారం "జిల్‌హిజ్జ" మాసం పేరుతో జరుపుకుంటారు. గ్రామ శివారులోని ఈద్గాల వద్దకు నమాజ్ ఆచరిస్తారు. ఈసందర్బంగా ముస్లీం సోదరులు మాట్లాడుతూ సమిష్టి ప్రయోజనం కోసం వ్యక్తిగత స్వార్థాన్ని విడిచి త్యాగాలకు సిద్దపడ్డప్పుడే సమాజహితం జరుగుతుందని త్యాగాల ద్వారా ప్రాప్తించిన ప్రయోజనాలు సమస్త జనులకు సమానంగా అందించనప్పుడు ఆ త్యాగాలకు సార్థకత చేకూరుతుందనే సందేశాన్ని బక్రీద్ పండుగ విశ్వమానవాళికి అందిస్తుందన్నారు. బక్రీద్ భక్తి, త్యాగం, కరుణ, విశ్వాసం అనే గొప్ప గుణాలను ప్రజల్లో పెంపొందిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ముస్లీం మత పెద్దలు, ముస్లీం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## మహానంది క్షేత్రంలో ఘనంగా తొలిఏకాదశి వేడుకలు

**మహానంది, జూన్ 29, ప్రభాతవార్తః** ప్రముఖ శైవక్షేత్రమైన మహానంది క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ ఇఒ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని అధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈపూజల్లో భాగంగా ముందుగా గణపతిపూజ, పుణ్యాహవచనం, ఉపచార పూజలు, పుణ్యాజల సంప్రోక్షణ, మహానందీశ్వరస్వామి వారికి పంచసూక్తాభిషేకం, కామేశ్వరీదేవి అమ్మవారికి ఖడ్గమాలర్చన కోదండరామస్వామి వారికి అష్టోత్తర పూజలు, లోకకళ్యాణం కొరకు పూజలు నిర్వహించినట్లు వేదపండితులు తెలిపారు. ఈతొలిఏకాదశి పండుగ పురస్కరించుకొని భక్తులు క్షేత్రానికి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుమల పునీత్ నందు ఉచిత వైద్యశిబిరం

**నంద్యాల హాస్పటల్, జూన్ 29, ప్రభాతవార్తః** నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ గేట్ వద్ద తిరుమల పునీత్ ఆసుపత్రి నందు వి సత్యనారాయణ జ్ఞాపకార్థం సందర్భంగా తిరుమల పునీత్ నందు ఉచిత చెవి, ముక్కు, గొంతు, మరియు చర్మవ్యాధుల వైద్యశిబిరం జరుగుతుందని డా.వి అనిల్ కుమార్, డా.వి హరితలు తెలిపారు. ఈశిబిరంలో చెవిలో చీముకారుట, వినికిడి సమస్యలు దిబ్బడ, దూలం, వంకర, సైనసైటిస్, తమ్ములు, ముక్కులో నీరు కారుట ముక్కులో కోసులు, కండలు, గలిగలు, గొంతు సమస్యలు, చర్మవ్యాధులకు సంబంధించి పులిపిరులు, చమటలకు నల్లమచ్చలు మొదలగు వ్యాధులకు ఉచితంగా చికిత్సలు చేసి అనంతరం వారికి మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు సెల్‌నం.9381162284ను సంప్రదించాలన్నారు.

## రామాలయంలో ఘనంగా ఏకాదశి వేడుకలు

**నంద్యాల టెక్కె, జూన్ 29, ప్రభాతవార్తః** నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ కోదండ రామాలయంలో గురువారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగవత్‌సేవా సమాజ్ అధ్వర్యంలో సామూహిక ఉచిత సత్యనారాయణ స్వామి రథం భక్తుల చేత యాదవల్లి కార్తికేయశర్మ అర్చకత్వంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి దివ్య మంగళ నేత్ర దర్శనం తొలి ఏకాదశి, స్వాతీనక్షత్రం, ఒట్టివేర్ల మహాగజమాలతో అలంకృతుడైన మత స్యఅవతార రూపంలో కలియుగ ప్రత్యక్షదైవ రూపం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలంకారప్రాయంగా అలంకరించారు. భగవత్‌సేవా సమాజ్ నిర్వాహకులైన సముద్రాల సూరయ్య, వంకదార మదుసూధన్‌రావు మాఘం గురుప్రసాద్, దేవరశెట్టి శ్రీనివాసుల అధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పండుగ సందర ్బంగా పట్టణంతో పాటు సుదూర ప్రాంతాల ప్రజలు ఏకాదశి పవిత్ర దినాన్ని దేవాలయంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు వెంకటేశ్వరస్వామి అలంకరణ చూసి అశ్చర్యం నొంది ఆనందించారు.

## ప్రశాంతంగా ముగిసిన తొలి ఏకాదశి, బక్రీద్ పండుగలు

**ఉయ్యలవాడ, జూన్ 29, ప్రభాతవార్తః** హరివరం, మాయలూరు, ఆల్లూరు, పెద్ద ఎమ్మానూరు, ఇంజేడు తదితర గ్రామాల్లో గురువారం తొలిఏకాదశి, బక్రీద్ పండుగలు ప్రశాంతంగా ముగిశాయి. రెండు పండుగలు ఒకేరోజు రావడంతో హిందువులు, ముస్లీంలు, సంతోషంగా పండుగలు జరుపుకున్నారు. కుందూనది ఒడ్డున ఉన్న ఈద్గాలో ముస్లీంలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. హిందువులు దేవాలయాల్లో కాయకర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

## వెల్దుర్తి మండలంలో తొలి ఏకాదశి పూజలు

**– హిందువుల తొలి పండుగ ఏకాదశి**

**వెల్దుర్తి, జూన్29, ప్రభాతవార్త :** వెల్దుర్తి మండలంలో హిందువులు గురువారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా జరుపుకున్నారు. హిందువుల తొలి పండుగ ఏకాదశి. ఏ మంచి కార్యక్రమం ప్రారంభించినా హిందువులు దశమి ఏకాదశుల కోసం ఎదురు చూస్తుంటారు. ఏడాది పొడవునా ఉండే 24 ఏకాదశుల్లో ఆషాఢ శుక్ల ఏకాదశిని తొలి ఏకాదశిగా పాటిస్తారు. పూర్వకాలం ఇదే రోజును సంవత్సర ఆరంభంగా పరిగణించేవారు. బ్రహ్మగుండం అర్చకులు, వేదపండితులు యార్లపాటి శ్రీధర్‌శర్మ పండుగ విశేషాలను ప్రభాతవార్తకు వివరించారు. తొలి ఏకాదశి పురస్కరించుకొని భక్తులు రోజంతా ఉపవాసం నుండి రాత్రికి జాగారం చేస్తారు. మరుసటిరోజు ఉదయం విష్ణుమూర్తిని పూజించి తీర్థప్రసాదం స్వీకరించాక భోజనం చేస్తే జన్మజన్మల పాపాలు ప్రక్షాళన అవుతాయనేది నమ్మకం అన్నారు. ఏకాదశి అంటే పదకొండు. జ్ఞానేంద్రియాలు అయిదు, కర్మేంద్రియాలు అయిదు, మనసు ఒకటి. వీటిని మానవుడు తన ఆధీనంలోకి తీసుకొచ్చి వాటన్నింటిని ఏకం చేసి దేవుడికి నివేదన చేయాలి. ఇలా చేయడం వల్ల మనిషిలో బద్ధకం దూరమవుతుంది. రోగాలు దరి చేరవు. ఇంద్రియ నిగ్రహం పెరుగుతుంది. అందుకే తొలి ఏకాదశి ఆరోగ్యానికి తోడు ఆనందం సొంతం చేస్తుందన్నారు. ఈ తొలిఏకాదశి పండుగ పురస్కరించుకొని వెల్దుర్తి మండలంలోని అన్ని ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు భక్తులు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.

## 21వ వార్డుప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలు

**– జగనన్న సురక్ష కార్యక్రమం....కలెక్టరు ఆదేశాలు**

**నంద్యాల విద్య, జూన్ 29, ప్రభాతవార్తః** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతిఒక్కరికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ ఇచ్చిన సూచనలు మేరకు జూలై 1న 21వ వార్డు సచివాలయ నూనెపల్లె హరిజన వాడ వద్ద ప్రత్యేక క్యాంపును ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. వార్డు ప్రజలు ఈసంక్షేమ పథకాల వల్ల కలుగు లబ్దికోసం అవసరమగు ధృవపత్రాలను ఉచితంగా ఈప్రత్యేక క్యాంపులో తీసుకోవాలని తెలిపారు. ఈక్యాంపులో లబ్దిదారులు కోరిన, కుల, నివాస, ఆధాయం ధృవీకరణ సర్టిఫికెట్లతో పాటు జనన, మరణ ధృవీకరణ, మ్యూటేషన్ ఫర్ ట్రాక్షన్షన్, మ్యూటేషన్ ఫర్ కరెక్షన్, మ్యారేజ్ ఫ్యామిలి మెంబరు సర్టిఫికెట్, అధార్‌కార్డుకు మొబైలన్‌నంబరు అప్‌డేట్, కౌలు రైతుల గుర్తింపుకార్డులు, కొత్త రేషన్‌కార్డు, రేషన్‌కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి, కుటుంబ వివరాలోల సభ్యుల పేర్లు తొలగింపు, చేర్పులు వంటి సేవలు పొందవచ్చు అన్నారు. 11 రకాల సేవలు ధృవీకరణ పత్రాలు ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా ఇచ్చేందుకు ఒకరోజు క్యాంపు ఏర్పాటు చేశారు. ఈక్యాంపును వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనా న్నరు.

## రామళ్లకోట రోడ్డులో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు

**వెల్దుర్తి, జూన్29, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణ సమీపంలోని బ్రిడ్జి వద్ద రామళ్లకోట రోడ్డు నందు 5రోడ్ల కూడలిలో ఇటీవల విద్యార్థులు, వాహనదారులు, చాలా మంది రోడ్డుప్రమాదాలకు గురై గాయపడిన సంఘటనలు జరిగాయి. ఈ విషయంపై స్పందించిన వెల్దుర్తి సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ పి.యుగంధర్ ఆ ప్రమాదం జరిగన సంఘటన ప్రదేశంలో వేగాన్ని నియంత్రించేందుకు గురువారం స్పీడ్‌బ్రేకర్లు వేయిస్తున్నారు. దీంతో రాణితోట కాలనీ వాసులు, ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే భకు_లు, 1వ వార్డు ప్రజలు, విద్యార్థుల తల్లితండ్రులు, వాహనదారులు ఈ సందర్బంగా సిఐకు కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తిశ్రద్దలతో బక్రీద్ పండుగ

**చాగలమర్రి, జూన్29, ప్రభాతవార్త:** మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ పండుగను గురువారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. మండలంలోని అన్ని మసీదులు, ఈద్గాలల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చాగలమర్రి పట్టణంలోని ఈద్గాలో ప్రభుత్వ ఖాజీ యూనుస్ త్యాగం, సహనం, ఐక్యమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందని తెలిపారు. దైవప్రవక్త ఇబ్రహీం స్పూర్తితో ప్రజలు సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, పరోపకారం, బాధ్యత భావం అలవర్చుకోవాలని తెలిపారు. దేవుడు దయతో ప్రజలందరు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలందరికి అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటున్న మన్నారు. మతసామరస్యం వెల్లివిరియాలని ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలందరు అన్నదమ్ముల మాదిరిగా కలిసిమెలసి ఉండాలని వారు కోరుకున్నారు. ఈ ప్రార్థన లకు ఇన్‌చార్జ్ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ రమణయ్య, పోలీస్

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**బేతంచెర్ల, జూన్29, ప్రభాతవార్త:** పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన బూసి నాగపెద్ద తిమ్మయ్య(68) అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు, కౌన్సిలర్ రామగోపాల్‌లు మృతుని భార్య నాగలక్ష్మమ్మకు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. నాగ తిమ్మయ్య మృతి సమాచారాన్ని అందుకున్న టీడీపీ ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షులు గూటం శివ, టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ చైర్మన్ మేకల నాగరాజు, కౌన్సిలర్ రామగోపాల్, నంద్యాల మధు, రూబెన్ నాగతిమ్మయ్య కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది.

## త్యాగనీరతికి చిహ్నాం బక్రీద్ - చల్లా విఘ్నేశ్వరరెడ్డి

**అవుకు, జూన్29, ప్రభాతవార్త:** బక్రీద్ పర్వదినం సందర్భంగా అవుకు పట్టణంలోని ముస్లిం మతపెద్దలు, ముస్లిం సోదరులు ఈద్గా వద్ద నమాజ్ చేసి అల్లాను ప్రార్థించారు. అనంతరం అవుకు పట్టణంలోని చల్లా కార్యాలయంలో వైసీపీ ముఖ్యనేతలు చల్లా విఘ్నేశ్వరరెడ్డిని, అవుకు గ్రామ మాజీ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చల్లా విఘ్నేశ్వరరెడ్డి మాట్లాడుతూ బక్రీద్ త్యాగనీరతికి చిహ్నామని తెలియజేశారు. గ్రామంలో అందరు కలిసిమెలసి ఒకటిగా ఉంటూ ప్రతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని తెలియజేశారు. ఈ వేడుకలు అవుకు గ్రామ ముస్లిం మతపెద్దలు మరియు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఘనంగా తొలిఏకాదశి వేడుకలు

**చాగలమర్రి, జూన్29, ప్రభాతవార్త:** మండలంలోని పలు గ్రామాల్లో తొలిఏకాదశి పండుగ వేడుకలను అత్యంత భక్తిశ్రద్దలతో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలిఏకాదశిని పురస్కరించుకుని మహిళలు ఉపవాసం ఉండి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చాగలమర్రి పట్టణంలోని షిరిడి సాయినాధ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## టీడీపీ కార్యకర్త మృతి పార్టీకి తీరని లోటు

**– మృతి పట్ల సంతాపం తెలిపిన సీనియర్ టీడీపీ నాయకులు**

**గడివేముల, జూన్29, ప్రభాతవార్త ;** మండలంలోని గ్రంధివేముల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నందిపల్లె ఎల్లగౌడ్ అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీనియర్ టీడీపీ నాయకుడు బూజునూరు పంట రామచంద్రారెడ్డి గ్రంధివేముల గ్రామానికి వెళ్లి మృతుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఎల్లగౌడ్ పార్టీ కోసం కష్టపడి పనిచేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## ఘనంగా బక్రీద్ పండగ వేడుకలు

**గడివేముల, జూన్29, ప్రభాతవార్త ;** మండలంలో గురువారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లీం సోదరులు భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించుకున్నరు. ముస్లీం సోదరులు ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు చేశారు. ఈమామ్‌లు బక్రీద్ సందేశాన్ని తెలియజేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుసుకున్నారు. ముస్లీం సోదరులు తలస్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి అత్తరు పూసుకొని మసీదులకు, ఈద్గాలకు వెళ్లి నమాజు చేశారు. ఉలేమాలు ఇచ్చిన ధార్మిక ప్రసంగాల అనంతరం ప్రత్యేక నమాజ్ చేశారు. గడివేముల ఎస్ఐ బి.టి.వెంకటసుబ్బయ్య ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్ఐ ముస్లీం సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## భక్తిశ్రద్దలతో బక్రీద్ పండగ వేడుకలు

**– ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లీం సోదరులు**

**కౌతాళం, జూన్29, ప్రభాతవార్త ;** ముస్లీం సోదరులు గురువారం బక్రీద్ పండగను భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. పవిత్ర త్యాగాలకు ప్రతీక అయిన ఈ పండగను ఈదుల్ అజహా ఈదుజ్జహా బక్రీద్ అని కూడా అంటారు. బక్రీద్ సందర్భంగా సంప్రదాయాన్ని అనుసరించి నూతన వస్త్రాలను ధరించి మహమ్మదీయ సోదరులు స్థానిక కొత్త మసీదు పాత మసీదుల నుంచి బాపురం రోడ్డు మీదుగా వెంట సామూహిక ప్రార్థనలు చేస్తూ ఈద్గాకు ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా ముస్లీంలు పరస్పరం ఒకరినొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఇస్లాం మతంలోని ఐదు ప్రధాన సూత్రాల్లోఒకటైన హజ్ తీర్థ యాత్రను ముస్లీంలు చేయవలసి ఉంటుంది. ఈద్గా వద్ద బక్రీద్ సందర్భంగా నిర్వహించిన సామూహిక ప్రార్థన కార్యక్రమాల్లో వేలాది మంది ముస్లీం సోదరులు పాల్గొన్నారు. ప్రతిఒక్కరు సేవాభావాన్ని కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ముందేనాటితే.. ముంచేసింది

**కొత్తపల్లి, జూన్29, ప్రభాతవార్త ;** ఖరీఫ్ ప్రారంభంలో బోర్లు, బావులకింద ముందస్తుగా సాగు చేసిన రైతులు వర్షాలు కురవక తీవ్రంగా నష్టపోతున్నారు. పంట ఎదుగుదల లేకపోవడంతో పంటలను దున్నేస్తున్నారు. కొత్తపల్లి మండలం లోని ఎదురుపాడు గ్రామానికి చెందిన బోయ శివలింగం మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని నెలరోజుల క్రితం పత్తి సాగుచేశాడు. పంటకి మొదటిసారి రసాయనిక ఎరువులు వేశాడు. అయిన ఎదుగుదల లేకపోవడంతో గురువారం పత్తిపంటను పీకేసి ఎద్దుల సాయంతో దున్నేశాడు. కౌలు మూడు ఎకరాలు రూ.55 వేలకు తీసుకునీ బోరు ఉందని ఆశగా ముందుగానే పత్తి సాగుచేశాడు. విత్తనం వేసి నెలరోజులు అవుతున్న ఎదుగుదల లేకపోవడంతో బుధవారం కురిసిన వర్షానికి గురువారం పత్తిపంటను పీకేసి దున్నేశాడు. దాంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

## అవోపా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**– అవోపా ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు, అద్దాల పంపిణీ**

**ఆదోనిలీగల్, జూన్29, ప్రభాతవార్త ;** ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెసనల్ అండ్ అసోసియేషన్ (అవోపా) సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అవోపా అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా సూచించారు. గురువారం స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో ఈనెల 3వ తేదీన అవోపా ఆధ్వర్యంలో 258 మంది రోగులకు ఉచిత చెకప్ చేసి అర్హులైన వారందరికీ కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇంకా కొన్ని కంటి ఆపరేషన్ల క్యాంపులు మున్ముందు చేస్తామని సెక్రటరీ మిరియాల శ్రీధర్ తెలిపారు. వీటన్నిటికీ తాను దాతగా నిలిచి ప్రజాసేవ చేస్తానని కాకుబాల్ నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమం వాసవీ కళ్యాణ మందిరంలో జరిగింది. ఈ కళ్యాణ మండప కమిటీ వారు కూడా ప్రతిసారి వేదికని ఉచితంగా ఇస్తూ సహకరిస్తున్నారని మహిళా విభాగ్ అధ్యక్షులు సంగీత అన్నారు. ఈ కార్యక్రమానికి కర్నూలు విశ్వభారతి ఆస్పత్రి నుంచి డాక్టర్ సురేష్ వైద్యబృందం, అవోపా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనాథ్‌గుప్తా, మిర్యాల శ్రీధర్, ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్నశెట్టి, రంగనాయకులు, మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు బూదూరు సంగీత, వంకదారు మమత, సభ్యులు ప్రతాప్, హిమబిందు, వంకదారి గీత, కవితశ్రీ, తులసీ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్దలతో బక్రీద్ పండుగ

**బనగానపల్లె, జూన్29, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్దలతో బక్రీద్ పండుగను గురువారం జరుపుకున్నారు. ముస్లిం సోదరులు పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పరస్పరం ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హజరత్ ఇబ్రహీం తన కుమారుడిని బలి ఇవ్వడానికి సిద్దపడగా అల్లా ఆదేశం మేరకు పొట్టేలును బలి ఇవ్వడం జరిగిందని అందుకు ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకుంటారని ముస్లిం పెద్దలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుళరెడ్డి బక్రీద్ పండుగ కార్యక్రమంలో ముస్లిం యువకులతో కలిసి కేక్‌కట్ చేసి వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బనగానపల్లె పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ యూత్ నాయకుడు అత్తార్ అఖిల్ హుస్సేన్ బక్రీద్ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గ వైసీపీ నాయకులు కాటసాని ఓబుళరెడ్డిని తేనేటి విందుకు ఆహ్వానించడంతో బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపి తేనేటి విందును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మైనార్టీ నాయకులు అబ్దుల్ ఫైజ్, అత్తార్ జాహీద్ హుస్సేన్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అంబటి రవి, దుర్గా, చంద్రమౌళీ, మమ్మదా, మోహన్‌రెడ్డి, కాటసాని ఓబుళరెడ్డి యూత్ సభ్యులు మరియు ఇతర మండలాలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

## ఏక లవ్యుని జీవితం... దేశానికే ఆదర్శం.. జిల్లా ఎరుకలి సంఘం ఉపాధ్యక్షులు నాసారి మద్దిలేటి

**: పట్టణంలోని ఏకలవ్య నగర్ లో ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు**



**ఆత్మకూరు జూన్ 29 ప్రభాతవార్త :** ఏకలవ్యని జీవితం దేశానికే ఆదర్శంగా నిలిచిందని నంద్యాల జిల్లా ఎరుకలి సంఘం ఉపాధ్యక్షులు నాసారి మద్దిలేటి 20వ వార్డు కౌన్సిలర్ రంగస్వామి పేర్కొన్నారులి గురువారం పట్టణంలోని ఏకలవ్య నగర్ లో ఏకలవ్యని జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు ముందుగా ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలవేసి మహిళలు ఎరుకలి సంఘం నాయకులు పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి జయంతి సంబరాలు చేసుకున్నారు ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఏ.పీ వై.ఎస్.ఎస్ ఎరకలి సంఘం ఉపాధ్యక్షులు నాసారి మద్దిలేటి మాట్లాడుతూఏకలవ్యుని తన జీవితం ప్రాణాలకు ప్రాణంగా పెట్టి దేశంలో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు నేటి యువత ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నిలవాలని పిలుపునిచ్చారు చరిత్రలుగా నిలిచి కథలుగా చెప్పుకునే ఒక చరిత్ర ఉన్న ఏకలవ్యుడి జీవితం పలువురికి ఎంతోమందికి ఆదర్శంగా ఉంటుందని వివరించారు రాష్ట్రంలో ఎరుకలి హక్కుల పోరాట సాధన కోసం తమ హక్కులను కాపాడుకునే విధంగా ముందుంటామని వివరించారు ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలలో ఎరుకలి సంఘానికి ప్రత్యేక నిధులు కేటాయించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చొరవ తీసుకోవాలని తెలియజేశారు నేడు ఎరుకలి జీవితాలు చీకట్లోనే మగ్గిపోతున్నాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గుర్తు చేశారు ఆర్థికంగా రాజకీయంగా బలోపేతమయ్యేందుకు జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని రంగాలలో ఎరుకలి సామాజిక వర్గానికి సమనాయం చేయాలని జయంతి వేడుకల్లో నా సారి మద్దిలేటి తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎరుకలి సంఘం నాయకులు పోతురాజు ధనుంజయుడు సుర సుర పాపారాయుడు నాగ శేషులు నవీన్ లీలా కుమార్ రాకేష్ కళ్యాణ్ సుంకన్న చిన్న పుల్లయ్య గుత్తి కేశవులు హరినాథ్ నల్లబోతుల సురేష్ చిన్న బాబు మరియు మహిళలు సులోచన మాధవి శైలజ తదితరులు పాల్గొన్నారులి

## పట్టణంలో ప్రముఖ న్యాయవాది సూదిరెడ్డి వెంకటరెడ్డి ఆత్మహత్య

**నందికొట్కూరు, జూన్ 29, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రముఖ న్యాయవాది సూదిరెడ్డి వెంకటరెడ్డి ఆత్యహత్యకు పాల్పడిన సంఘటన. పట్టణ సిఐ విజయబాస్కర్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. న్యాయవాది సూదిరెడ్డి వెంకటరెడ్డి భుధవారం రాత్రి పాయిజన్ తీసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని, చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు కర్నూలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతు కోలుకోలేక మృతి చెందాడని తెలిపారు. మృతుడు తన సూసైడ్ నోట్‌లో తనను ఆత్మహత్యా చేసుకునేలా చేశారని ఇద్దరి పేర్లు వ్రాసినట్లుగా సి.ఐ.తెలిపారు. మృతుని భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంఘటనకు గల కారణాలను విచారిస్తున్నట్లుగా సిఐ తెలిపారు.

**న్యాయవాదికి పలువురు సంతాపం :** ప్రముఖ న్యాయవాది ఎస్.వెంకటరెడ్డి మృతి చెందిన విషయం తెలియగానే డా.బైరెడ్డి మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి పలువురు నాయకులు మృతదేహాన్ని సంధర్శించి ఘనంగా నివాళీలు అర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాది బాస్కర్, ప్రధాన కార్యదర్శి శరభయ్య, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు నివాళీలు అర్పించారు.

## ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకై మరో ఉద్యమం..

**– ఎంఆర్‌పియస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు..**

**కోసిగి, జూన్ 29, ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకై ప్రభుత్వంపై మరో పోరాట ఉద్యమం చేయడం జరుగుతుందని, ఇందుకు ప్రతి ఒక్క మాదిగ చేయి చేయి కలపాలని ఎంఆర్‌పియస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు పిలుపు నిచ్చారు.. జూలై నెలలో నిర్వహించే ఛలో హైదరాబాద్‌కు సంబందించి బుధవారం కర్నూలు జిల్లా ఎంఆర్‌పియస్ కన్వీనర్ సుభాష్‌చంద్ర మాదిగ అధ్యక్షతన, కోకన్వీనర్ దుర్గప్పల ఆధ్వర్యంలో కోసిగిలో ఎంఆర్‌పియస్, ఎంఎస్‌పి నియోజకవర్గ నాయకుల సమావేశం నిర్వహించారు.. ఈ సందర్బంగా జాతీయ అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై అన్ని రాజకీయ పార్టీలు మాటతప్పాయన్నారు.. అయితే వర్గీకరణకు కట్టుబడి ఉన్న మహాజన సోషలిస్టు పార్టీని మాధిగలు ఆదరించాలన్నారు.. రాష్ట్రంలో సుమారు 8 శాతంపైగా ఉన్న మాదిగలను అన్ని రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయన్నారు.. వర్గీకరణకు సహకరించని పార్టీల జెండాలను ఎస్సీలు మోయరాదన్నారు.. 2024లో జరిగే ఎన్నికల్లో ఆయా పార్టీలకు తగిన బుద్ది చెప్పాలని పిలుపు నిచ్చారు.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వానికి నివేధికను పంపించాలని డిమాండ్ చేసారు.. ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకై జూలై మూడో వారంలో 20 లక్షల మంది మాదిగ ప్రజలతో ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. కర్నూలు నుండి ప్రారంభమైన ఛలో హైదరాబాద్ సన్నాహక సమావేశాలు 95 నియోజకవర్గాల్లో గుంటూరు వరకు పర్యటన కొనసాగుతుందన్నారు. వర్గీకరణ లక్ష్యం, మహాజన సోషలిస్టు పార్టీ నుంచి చట్ట సభల్లో అడుగు పెట్టే దిశగా ప్రజలకు, మాదిగలకు చైతన్యం చేయడమే లక్ష్యంగా తమ పర్యటన ఉంటుందని జాతీయ అధ్యక్షులు నాగరాజు అన్నారు. అనంతరం ఎంఆర్‌పియస్, ఎంఎస్‌పి నాయకులు నాగరాజును ఘనంగా సన్మానించారు.. ఎంఆర్‌పియస్ జిల్లా కోకన్వీనర్ రెడ్డిపోగు భాస్కర్‌మాదిగ, కోసిగి, కౌతాళం కోకన్వీనర్లు సామేలు, వందగల్లు నరసింహులు, రాజాబాబు, ఆనంద్, వీరేష్, ఎర్రన్న, కోడి ఉరుకుందప్ప, సజ్జలగుడ్డం నరసింహులు, తిక్కస్వామి, ఉసేని, పాల్గొన్నారు..

## సస్పెండ్ అయిన ఉపాధి సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి-సిపిఐ

**వెల్దుర్తి, జూన్29, ప్రభాతవార్త :** ఎంఎన్‌ఆర్‌ఇజియస్ పథకంలో పనిచేస్తున్న ఉపాధి సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని లేని పక్షంలో రైతుకూలీలు, ఉపాధికూలీలతో కలిసి ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేసేందుకు సిద్దమవుతున్నామని సిపిఐ మండల కార్యదర్శి టి.క్రిష్ణ అన్నారు. స్థానిక సిపిఐ కారా ్యలయంలో గురువారం ఆయన రైతుసంఘం, రైతుకూలీలు, ఉపాధిహామీ కూలీలతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా క్రిష్ణ మాట్లా ్లడుతూ వాస్తవానికి వెల్దుర్తి మండలం వెనుకబడిన మండలం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అధికారులతో పలుమార్లు సమావేశాలు జరిపి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ, కులం, మతం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందించాలని చెప్పారన్నారు. అయితే మండలంలోని గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు గ్రూపులుగా ఏర్పడి పంతాలకు పోయి అధికారులను బలి చేస్తున్నారన్నారు. మండలంలోని ఒక గ్రామంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీలో భాగంగా గ్రామ సర్పంచ్‌కు ఫీల్డు అసిస్టెంట్‌కు సరిపడక ఉపాధిపనులు కలి ్పంచి కూలీల మన్ననలు పొందిన అధికారిని అలసత ్వం వహించారనే కారణంతో సస్పెండ్ చేశారన్నారు. అధికారపార్టీలోని వర్గ విభేదాల కారణంగా మండల స్థాయి అధికారులు సైతం పనులు చేయలేకపోతున్నారనేది వాస్తవమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాధవక్రిష్ణ ,డి.బాలరాజు, యల్లశేఖర్, ఎల్లరాముడు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## బనగానపల్లె ఘనంగా ఏకలవ్య జయంతి

**బనగానపల్లె, జూన్29, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలో శ్రీ సుంకులమ్మ గుడి వద్ద ఏకలవ్య జన్మదిన కార్యక్రమాన్ని ఎరుకల సంఘం వారు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలవేసి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోనివృద్ధాశ్రమంలో వృద్దులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణి చేశారు.

**ఏపీ ఎరుకల సేవా సంఘం ఎన్నిక :** ఏపీ ఎరుకల సేవా సంఘం బనగానపల్లె మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పి.వి.గాయత్రీదేవి, రాష్ట్ర కమిటీ చైర్మన్ లయన్ పాలపర్తి శ్రీనివాసులు, రాష్ట్ర గౌరవ సలహాదారులు, కోర్ కమిటీ సభ్యులు కోయిలకుంట్ల సుబ్బరాయుడు, మిగిలిన రాష్ట్ర రాయలసీమ జిల్లా కమిటీ సభ్యులందరి ఆధ్వర్యంలో బనగానపల్లె మండల కమిటీ ప్రమాణస్వీకారం గురువారం జరిగింది. మండల అధ్యక్షులుగా ఈసారి పెద్దరాముడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఈసారి కుమార్, రాయలసీమ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఈసారి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులుగా దేగల విఘ్నేష్, ప్రధాన కార్యదర్శులుగా పెనుగొండ శ్రీరాములు, దేగల ఈరన్న, పెనుగొండ రామదాసు, ఇతర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వారు బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ఎరుకల కులస్తులందరూ సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషమని ఐకమత్యంగా ఉండి సంఘాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సేవా సంఘం మండల శాఖ అధ్యక్షులు ఈసారి పెద్దరాముడు, రాష్ట్ర కార్యదర్శి ఈసారి కుమార్, జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి దేగల విఘ్నేశ్వరుడు, కార్యవర్గ సభ్యులు ప్రతాప్, రమేష్, శ్రీరాములు, రాముడు, శ్రీనివాసులు, పరుశురాముడు, ఈసారి ఎల్లయ్య, ఎరుకల సంఘీయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తొలిఏకాదశి వేడుకలు

**చాగలమర్రి, జూన్29, ప్రభాతవార్త:** మండలంలోని పలు గ్రామాల్లో తొలిఏకాదశి పండుగ వేడుకలను అత్యంత భక్తిశ్రద్దలతో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలిఏకాదశిని పురస్కరించుకుని మహిళలు ఉపవాసం ఉండి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చాగలమర్రి పట్టణంలోని షిరిడి సాయినాధ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఎవరిది చెత్త పని

**– బనగానపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో ట్రాక్టర్ చెత్తను గుమ్మరించిన ఆగంతకులు**

**బనగానపల్లె, జూన్29, ప్రభాతవార్త:** ఎవరు వేశారో ఎందుకు వేశారో కాని బనగానపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయ ముంగిట్లో ట్రాక్టర్ చెత్తను వేసి ఆ విధంగా తమ చెత్త కోపాన్ని పంచాయతీ అధికారుల పై తీర్చుకున్న సంఘటన బుధవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే బనగానపల్లె పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం రాత్రి 7గంటల ప్రాంతంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ నిండా చెత్తను తీసుకువచ్చి పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఈవో ఆఫీస్ ఎదుటనే చెత్తను గుమ్మరించి వెళ్లారు. అయితే ఆ సమయంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది ఎవరు లేకపోవడంతో ఆ చెత్త ఎవరు వేశారు అన్నది తెలియరావడంలేదు. గ్రామ పంచాయతీకి చెందిన స్వీపర్ ఒకరు ఈ విషయాన్ని ఈవో ఖలీల్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన హుటాహుటినా వచ్చి అక్కడి పరిస్థితిని గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈవో ఫిర్యాదు మేరకు ఎస్ఐ గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. ప్రస్తుతం ఈ సంఘటన ఇప్పుడు పట్టణంలో తీవ్ర సంచలనం సృష్టిస్తుంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం బనగానపల్లె పట్టణంలో అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితుల నేపథ్యంలో ఈ చెత్త పని ఎవరిది అన్నది అంతుపట్టడంలేదు. అయితే ఈ చెత్త పని చేసేంత దుస్సాహసం ప్రతిపక్ష పార్టీ పనే అన్నది అని ప్రజల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికార పక్షం ఇందుకు ఏ విధంగా బదులిస్తుందో వేచి చూడాలి.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**బేతంచెర్ల, జూన్29, ప్రభాతవార్త:** పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన బూసి నాగపెద్ద తిమ్మయ్య(68) అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు, కౌన్సిలర్ రామగోపాల్‌లు మృతుని భార్య నాగలక్ష్మమ్మకు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. నాగ తిమ్మయ్య మృతి సమాచారాన్ని అందుకున్న టీడీపీ ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షులు గూటం శివ, టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ చైర్మన్ మేకల నాగరాజు, కౌన్సిలర్ రామగోపాల్, నంద్యాల మధు, రూబెన్ నాగతిమ్మయ్య కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది.

# దమ్ముంటే విడివిడిగా పోటికి రండి: ఏమ్మేల్యే శిల్పా

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్29, ప్రభాతవార్త**
వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టితో దమ్ముంటే రెండు పార్టిలు విడివిడిగా పోటికి రండని శ్రీశైలం నియేజకవర్గ ఏమ్మేల్యే శిల్పాచక్రపాణిరెడ్డి సవాలు విసిరారు.కాగా గురువారంనాడు శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల దర్శనానంతరం అతిది గృహం వద్ద విలేఖర్లతో మాట్లడారు.ఏపి ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ప్రతిష్టత్మకంగా చెపట్టిన సురక్ష పథకం నుండి రాష్ట్రంలో 2లక్షల 60 వేల మంది గ్రామ వాలంటరీలు,1లక్ష 50 వెల మంది సచివాలయాల ఉద్యోగులు,3 వెల మంది మండల స్థాయి అదికారులు,రాష్ట్రంలో 15 వేల సచివాలయాల ఉద్యోగులు అందరు కలిసి 99శాతం ఇప్పటి వరకు పథాకాలను అమలు పరచడం జరిగిందని తెలిపారు.ఒక్కశాతం కూడా మిగిలిపోకూడదని అర్హులైన వారందరికి కూడా సురక్ష పథకం ద్వారా అమలు జరపాలని ఇంటి ఇంటికి వెళ్లి పథకాలు అమలు కాలేదో వాటిని కూడా పూర్తి చేసేందుకు ఈ నెల 24న మొదలు పెట్టి 30 వ తేదికి పూర్తికావడం జరుగుతుందని వ్యాక్యనించారు.ఇటువంటి పథకాలు బారతదేశంలో ఏరాష్ట్రంలో కూడా పథకాలు అమలు



పరచిన దాఖాళాలు లేవని అన్నారు. చంద్రబాబునాయుడు వాగ్దనాలు చెయడమే తప్ప ఆదికారంలోకి వచ్చినాకా ఎన్నో వాగ్దనాలను మొసపూరిత వాగ్దనాలను నేరవేర్చుకపోగా మళ్లి ఆదికారంలోకి రావాలని చూడడం హస్యస్పదం అన్నారు.దత్తపుత్రుడిని పెట్టుకోని చెప్పులు చూపించుకోంటూ తల ఒక్కదిక్కు తిరుగుతూ ఉండడం జరుగుతుందని అన్నారు.ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఎలక్షన్లు చేస్తాము తరువాత అన్నతమ్ములు మాదిరిగా తిరుగుతామని అన్నారు.సురక్ష పథకం ద్వారా సమస్యలన్నింటిని పరిస్కరించేదుకు చేయడం జరుగుతుందని చెప్పారు.రాజకీయం అంటే అసహ్యంగా చేయకుండా ప్రజలు ఒప్పించే విధంగా మెప్పించే విధంగా రాజికీయం చేయండి ప్రజల్లోకి తీసుకెళ్లండి అంతే కాని గతంలో మహిళలను మొసం చేసిన సంగతి ప్రజలు మరిచిపోలేదని అన్నారు.దమ్ము నాయకుడు మా జగన మోహన్రెడ్డి ఏదైన సరే ఇంకా సంక్షేమ పథాకాలు ఇస్తామని చెప్పండి అడ్డగోలుగా నోటికి ఏది వస్తే అదివాగుతూఉండడం సరికాదని తెలిపారు. చంద్రబాబునాయుడు మొసాలతో చేసిన రాజకీయం ఈరోజు భ్రష్టుపట్టిందని అన్నారు. అందుకే ప్రజలు జగనన్నకు 151 సీట్లు ఇచ్చారని చెప్పారు.చెప్పిన వాటిని 99 శాతం పనులు చేయడం జరిగిందని పేర్కన్నారు.ఉద్యోగులకు కూడా పిఆర్సి ప్రకటిచడం ,60 వెల మందికి టీచర్లకు పదోన్నతులు రెండుసార్లు ఇవ్వడం జరిగిందని చెప్పారు.అన్ని వర్గాల ప్రజలు జగనన్న పాలనకు బ్రహ్మారథం పట్టడం జరుగుతుందని చెప్పారు.రాబోయే ఎన్నికల్లో 175కు 175 సీట్లు రావడం ఖాయం అని అన్నారు.

## అడ్డుపడితే ఎన్కౌంటర్ చేస్తా

**- సాక్షాత్తు ఎస్పీ కార్యాలయం ఎదురుగా వ్యక్తి ఆత్మహత్యయత్నం**

**నంద్యాల క్రైం, జూన్ 29, ప్రభాతవార్తః**
చట్టం, న్యాయం, ధర్మాన్ని రక్షించాల్సి న అధికారే ఓ స్థల వివాద సంఘటనలో అడ్డుపడితే ఎన్కౌంటర్ చేస్తానని రాయలసీమ జిల్లాలోని ఒక పోలీస్బాస్ హెచ్చరికలు జారీచేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీస్ బాస్ బెదిరింపులకు తాళలేక సాక్షాత్తు ఎస్పీ కార్యాలయం ఎదురుగానే ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. సివిల్ పంయితీలు పోలీస్స్టేషన్లో చేయకూడదని పెద్ద పెద్ద బోర్డులు అదేశాలు ఇచ్చినప్పటికి ఆ పోలీస్ ఉన్నతాధికారి సివిల్ పంచాయితీలు చేయడం ఆయనకు వర్తించవా? బాధితులు వివరాల్లోకి వెళ్లితే జమ్ములమడుగుకు చెందిన వైసీపీ నేత నాగేంద్రయాదవ్ కడప నుంచి నంద్యాలకు వస్తుండగా ఆళ్లగడ్డ సమీపంలో హెర్బిసిడ్ పురుగుల మందు తాగి ఒక్కడే కారు డ్రైవింగ్ చేసుకుంటూ జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్నాడు. ఎస్పీ కార్యాలయం ముందు మరో లీటరు మందు తాగారు. తన స్థల వివాదంలో ఎస్పీ చంపుతానని బెదిరింపులు చేశాడని తనముందే స్థలంలో ఫెన్సింగ్ మామిడిచెట్లు నాటించడం జరిగింది. ఇందుకు నాగేంద్రయాదవ్ అడ్డుపడగా ఎస్పీ బెదిరింపులు చేయడంతో పాటు ఎన్కౌంటర్ చేస్తానని హెచ్చరించారు. గత రెండు నెలల నుంచి స్థల వివాదంలో బెదిరింపులు చేస్తున్నారని కోర్టు నుంచి ఇంజెక్షన్ అర్డన్ను తెచ్చిన కూడ అగకుండ దౌర్జన్యం చేసిందుకు భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని కుటుంబ సభ్యులు తెలిపారు.నంద్యాల ప్రభుత్వానుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

## అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు

**- ఎమ్మెల్యే శ్రీదేవమ్మ**

**పత్తికొండ, జూన్ 29, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిదేనని ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామ పంచాయతీ పరిధిలోని అమ్లేట్,అటికెల గుండు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ,ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అరులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిందన్నారు. గ్రామాల్లో ఏవైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నారాయణదాస్,నాయకులు నాగరాజు,ఎంపిటిసిలు,సర్పంచ్లు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్బోర్డు స్థలంలో అక్రమ కట్టడాలు... ఏవరు వచ్చినా నేను చుసుకుంటా

**- కలెక్టరు అదేశాలతో సగం మధ్యలో నిలిపిన స్లాబ్**




**నంద్యాల, జూన్ 29, ప్రభాతవార్తః**
నంద్యాలపట్టణంలోని నూనెపల్లెలో వక్ఫ్బోర్డు భూములు అక్రమణలకు గురవుతున్నా అడిగేవారు లేకపోవడం విడ్డూరంగా మారింది. ముస్లీంలు అధిక సంఖ్యలో ఉన్న నంద్యాల పట్టణంలోనే వక్ఫ్బోర్డు భూముల్లో అక్రమ కట్టడాల నిర్మాణాలు అధికార పార్టీ నాయకులు సెక్యూరిటి అండదండలతో భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయని అరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ స్థలం వద్దనే అధికార పార్టీ నాయకులు తిష్టవేసినట్లు సమాచారం. గురువారం బక్రీద్, తొలిఏకాదశి పండుగ అయినప్పటికి స్లాబ్ నిర్మాణం కొనసాగుతుండడంతో స్పాట్కు వెళ్లిన సచివాలయ సిబ్బంది ఏమిచేయలేని పరిస్థితుల్లో వెనక్కు తిరిగివచ్చారు. విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ అధికారులు జరుగుతున్న జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ అగ్రహం వ్యక్తం చేస్తు వెంటనే స్లాబ్ నిర్మాణాని అపేయాలని అదేశాలు జారీచేశారు. దీంతో మున్సిపల్ అధికారులు రంగ ప్రవేశంచేయడంతో అధికార పార్టీ నాయకులు పక్కకు తప్పుకున్నట్లు సమాచారం. స్లాబ్ వేసే కార్మికులు అక్కడే ఉండడం విశేషం. ఇప్పటికి వక్ఫ్బోర్డు అధికారులు మౌనముద్ర దాల్చడం పలు అనుమానాలకు తావిస్తుంది. శుక్రవారం ఈ సంఘటన ఎలా ఉంటుందోనని ప్రజలు ఎదురుచుస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో ముగిసిన బక్రీద్ పండుగ

**- ఈదుగాలో ప్రార్థనల్లో కలెక్టరు,ఎమ్మెల్సీలు**



**నంద్యాల, జూన్ 29, ప్రభాతవార్తప్రతినిధి :** ముస్లీంల అతిపవిత్రమైన పండుగలో ఒకటైన బక్రీద్ పండుగను నంద్యాల జిల్లా వ్యాప్తంగా ముస్లీం లంతా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈదుగాలో జిల్లా కలెక్టరు మనజీర జిలానిసామూన్, ఎమ్మెల్సీ ఇసాకుభాషలు పాల్గొని ప్రార్ధనలు చేశారు. బలిదానమునకు చిహ్నామైన బక్రీద్ను జిల్లా వ్యాప్తంగా గురువారము ఉదయము జరుపుకున్నారు.ముఖ్యంగా త్యాగాలకు ప్రతిరూపముగా నిలిచే ఈ పండుగ ముస్లీంలు ఎంతో నిష్టతో చేస్తారు.ఇబ్రహీం ప్రవక్త భక్తిని దేవుడు పరీక్షించాడని అయనకు ఒక పరీక్షను పెట్టడము అందులో తని ప్రియ కుమారుని తనకు బలిగా సమర్పించాలని కోరగా అ ప్రవక్త అందుకు సిద్ధపడి తన కుమారుని బలిగా అర్పిస్తుండగా దేవుని దూత ప్రత్యక్షమై కుమాని బలిని నివారించి అందుకు ప్రతిగా ఒక పట్టేలును అర్పించాలని చెప్పడముతో ఇబ్రహీం ప్రవక్త అలాగే నాడు చేశాడు నాటి నుండి ముస్లీంలు బక్రీద్ పండుగను అచరిస్తున్నారు. ఇందులో బాగంగా అందరు ఈదుగాకు వెల్లి ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రార్ధలు చేశారు. ఈ ప్రార్ధనలో నంద్యాల జిల్లా కలెక్టరు మనజీర జిలానిసామూన్ ప్రార్ధనలో పాల్గొన్నాడు.ఈయనతో పాటు ఎమ్మెల్సీ ఇసాకుభాష తదితరులు ప్రార్ధనల్లో పాల్గొన్నారు.

## గాయపడిన జింకపిల్లను ఫారెస్టు అధికారులకు అప్పగించిన టుటౌన్ పోలీసులు

**ఆదోని, జూన్ 29, ప్రభాతవార్త**
పట్టణంలోని 24వ వార్డు క్రాంతినగర్ గడ్డపై కుక్కల దాడిలో గాయపడిన పిల్ల జింకను ఫారెస్ట్ అధికారులకు టుటౌన్ పోలీసులు అప్పగించారు. బుధవారం సాయంత్రం తల్లి నుంచి విడిపోయిన జింక పిల్లను కుక్కలు దాడి చేస్తుండగా కాలనీవాసులు గమనించి కుక్కలను తరిమికొట్టి సంబంధిత సచివాలయంలో మహిళా పోలీసు హైమావతికి ఫిర్యాదు చేశారు. మహిళా పోలీస్ సంఘటన స్థలానికి చేరుకుని టుటౌన్ సిఐకి తెలుపగా స్పందించిన టుటౌన్ సిఐ శ్రీనివాసనాయక్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి ప్రథమ చికిత్స చేయించి జింకపిల్లను కాపాడారు. పోలీసులు,జెఎంఆర్ యూత్,కాలనీవాసులు ఫారెస్ట్ అధికారులకు జింక పిల్లను అందచేశారు.



## జిల్లాలో 22 మంది హెచ్ఎంలుగా ఇంచార్జీ బాధ్యతలు

**- ఉత్తర్వులు జారీచేసిన ఆర్జేడి**

**నంద్యాల విద్య, జూన్ 29, ప్రభాతవార్తః**
నంద్యాల జిల్లాలో ఉన్నత పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగు పరిచేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో 22 మంది హెచ్ఎంలు ఎంఇఓ 2 పోస్టుగా పోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఆ ఖాళీలను కడప ఆర్జేడి ఎం వెంకటకృష్ణారెడ్డి సీనియర్ అసిస్టెంట్లతో భర్తీచేస్తు ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె సుధాకర్రెడ్డి తెలిపారు. జడ్పీహెచ్ఎస్ బనగానపల్లెకు యాగంటప్ప, హనుమాన్ నగర్కు రాజశేఖర్, ముద్దవరపు రామదాసు, కోచెర్రువుకు మహమ్మద్రఫీ, తిమ్మనాయుని పేటకు సుమన్, కనకాద్రిపల్లెకు సుబ్బలక్ష్మమ్మ, కునుకుంట్లకు నాగరాజు, సంగపట్నంకు రవికుమార్, రామాపురంకు చౌడయ్య, సుంకేసులకు



జలందర్రెడ్డి, అవుకు బాలికల జడ్పీస్కూల్కు విజయలక్ష్మీ, ప్యాపిలి బాలికల జడ్పీ హెచ్స్కూల్కు శాంతిప్రియ,పిఆర్పల్లె స్కూల్కు శ్రీనివాసులు, గిద్దలూర పాఠశాలకు పద్మశేఖర్, కమలపురి జడ్పీహెచ్ స్కూల్కు పుశేనయ్య, నారాయణపురం జడ్పీహెచ్ఎస్కు సుబ్బయ్య, గోరుకల్లు జడ్పీహెచ్ఎస్కు అరుణకుమారి, యర్రగుడిదిన్నె పాఠశాలకు సత్యనారాయణ, రుద్రవరం పాఠశాలకు దస్తగిరిరెడ్డి, పారుమంచాల హైస్కూల్కు సుంకన్న, శ్రీశైలం జడ్పీస్కూల్కు సుబ్బారావు,గడిగరేవుల జడ్పీహెచ్ఎస్కు దస్తగిరిమ్మను ఫుల్ అడిషనల్ హెచ్ఎంలుగా నియమించారు. వీరు వెంటనే విధుల్లో చేరి హెచ్ఎం జాబ్చార్టు ప్రకారం విధులు నిర్వహించాలని అందుకు ప్రత్యేక అదేశాల్లో పేర్కొన్నారు.

## బక్రీద్ పండుగ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ దంపతులు



**బనగానపల్లెరూరల్, జూన్29, ప్రభాతవార్త:**
బనగానపల్లె పట్టణానికి చెందిన నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు రాయలసీమ సలాం గురువారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్రెడ్డి ఆయన సతీమణి బీసీ ఇందిరారెడ్డిని ఆహ్వానించడంతో వారు రాయలసీమ సలాం స్వగృహానికి చేరుకోగానే వారి కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే దంపతులకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్రెడ్డి మాట్లాడుతూ మీకు మీ కుటుంబ సభ్యులకు అలాగే పట్టణంలోని ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం రాయలసీమ సలాం కుటుంబ సభ్యులతో కలిసి కేక్కట్ చేసి పండుగ సంబరాలు జరుపుకున్నారు.అలాగే వారి అతిధ్యాన్ని స్వీకరించారు.అదే విధంగా పట్టణానికి చెందిన ముస్లిం సోదరులతోపాటు ఇతర గ్రామాల ముస్లిం సోదరులందరూ మర్యాదపూర్వకంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్రెడ్డిని ఆయన స్వగృహంలో కలుసుకుని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్,వెల్కం ఫోటోస్టూడియో అల్తాఫ్,టిప్టాప్ కలాం,హాజీ,అర్షద్,షేక్షావలి,నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు

**- మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి**

**బనగానపల్లెరూరల్, జూన్28, ప్రభాతవార్త:**
విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలను సాధించవచ్చునని బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు.ఈనెల 6వ తేదిన మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి తన సొంత నిధులతో పదవ తరగతి ఫలితాల్లో పాఠశాలస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.5వేలు పారితోషకం తోపాటు మెమొంటోను,మండలస్థాయి ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.15వేలు పారితోషకం తోపాటు మెమొంటోను అందజేసి ఘనంగా సత్కరించారు.అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల కోవెలకుంట్ల జిల్లా పరిషత్ ఉర్దు హైస్కూల్ నందు విద్యను అభ్యసించిన ఎం.అర్షియా అనే విద్యార్థిని ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారు.ఇందులో భాగంగానే సదరు విద్యార్థిని బనగానపల్లెకు వచ్చి మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని సంప్రదించడంతో వెంటనే స్పందించిన ఆయన ఎం.అర్షియాకు రూ.5వేలు



పారితోషకంతోపాటు మెమొంటోను అందించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ అర్షియా ఉర్దు పాఠశాలలో విద్యను అభ్యసించి పదవ తరగతి ఫలితాల్లో 85శాతం మార్కులు సాధించడం అభినందించదగ్గ విషయమని ప్రతిఒక్కరికి విద్య ఎంతో అవసరమన్నారు.ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా మంచిస్థాయికి ఎదగడంతోపాటు పది మందికి ఉపాధిని చూపవచ్చన్నారు.కావునా విద్యార్థులు విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని అప్పుడే వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు.విద్యార్థులు పేదరికంలో ఉన్నామని ఎప్పుడు కూడా బాధపడకూడదని అబ్దుల్కలాం,బీఆర్ అంబేద్కర్ లాంటి మహానుభావులు కూడా పేదరికం నుంచి వచ్చి ఉన్నతస్థాయికి చేరానని అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వెల్కల్ ఫోటోస్టూడియో అల్తాఫ్, ఫోటోగ్రాఫర్ నసీమ్,కోవెలకుంట్ల సాధిక్,విద్యార్థిని తండ్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ తిరస్కరించిందని యువకుడు బలవన్మరణం..

**కర్నూలు క్రైమ్, జూన్, 28, ప్రభాతవార్త :**



కర్నూలు నగరంలోని బిర్లాగేట్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న కొట్టాలలో నివసించే యువకుడు ఉరివేసుకోని బలవనమారినికి పాల్పడినట్లు మూడో పట్టణ సిఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.ఆయన తెలిపిన వివరాల మేరకు ఒక అమ్మాయి ప్రమను తిరస్కరించిందని బోయ మధు (25)జీవితంపై విరక్తి చెంది తన ఇంటి పక్కల ఉన్న కాళీ పెద్దులో ఐరన్ రాడ్డుకు దుప్పటితో ఉరి వేసుకున్నట్లు ఆయన తెలిపారు.మృతుడి తమ్ముడు విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఫిర్యాదు చేస్తున్నట్లు సిఐ తెలిపారు

## త్యాగం,సహనం,ఐకమత్యానికి ప్రతీక బక్రీద్



**ఆదోని, జూన్ 29, ప్రభాతవార్త**
త్యాగం,సహనం,ఐకమత్యానికి ప్రతీక బక్రీద్ పండుగ అని జిల్లా మాజీ వక్ఫ్బోర్డు డైరెక్టర్,ఇమామ్ కాసీం మస్జిద్ ప్రెసిడెంట్ నథాడ్ ఇస్మాయిల్ అన్నారు. గురువారం బక్రీద్ పండుగ పురస్కరించుకుని ఎమ్మెల్యే సాయిప్రసాద్రెడ్డి, డిఎస్పీ నారాయణస్వామి,1,2 టౌన్ సిఐలు విక్రమసింహా, రామ్నాయక్లను కలిసి శాలువాతో సత్కరించి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులందరు ఈద్గలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శాంతియుతంగా పండుగను నిర్వహించుకున్నారన్నారు. త్యాగానికి,సహనానికి,ఐకమత్యానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ పండుగను జరుపుకుంటున్న ముస్లిం సోదరులు, ప్రజాప్రతినిధులు, అధికారులు,రెవెన్యూ,పోలీసులు,పట్టణ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# సీమ సాగు నీటి వ్యవస్థపై శ్వేత పత్రము విడుదల చేయండి

**నంద్యాల, జూన్ 29, ప్రభాతవార్తప్రతినిధి**
రాయలసీమలో సాగు నీటి వ్యవస్థ వాస్తవ పరిస్థితి,అబివృద్ధికి చేపట్టాల్సి న ప్రాదాన్యత కార్యాచరణ కొరకు స్వతంత్ర సంస్థతో సమీక్ష చేపట్టి శ్వేత పత్రము విడుదల చేయాలిని సాగు నీటి సాదన సమితి అధ్యక్షులు బొజ్జదశరథరామిరెడ్డికోరారు. బుదవారము అయన నంద్యాల్లోమ విలేకర్లతో మాట్లడుతూ సాగు నీటి వ్యవస్థపై ముఖ్యమంత్రికి లేఖవ్రాశామని చెప్పారు. రాయలసీమ అబివృద్దితో పాటు అంద్రప్రదేశ్ రాష్ట్రంలో సమగ్రాబివృద్ధి లక్ష్యంగా మీరు అదికారములోకి వచ్చారు. అంద్రప్రదేశ్లోని వెనుక బడిన ప్రాంతమైన రాయలసీమ అబివీద్దికి కీలకమైన సాగు నీటిఇ రంగంపై అనేక సందర్బాల్లో అదికారులతో చర్చలు జరిపి సాగు నీటి రంగ అబివృద్దికి ప్రాదన్యాతలు ప్రకటించారని అయన గుర్తు చేశారు., అంద్రప్రదేశ్ రాష్ట్రంలో 2022-2023 నీటి సంవత్సరముతుంగభద్ర కృష్ణా నదుల పరవళ్లతో పునీతమైనందని రాయలసీమ గుండా తుంగభద్ర కృష్ణా జలాలు ఎన్నడూ లేనంతగా ఈ నీటి సంవత్సరము నిరంతరం ప్రవహించడమే గాక రావల్సిన నీటి కంటే అదికముగా నీరు వచ్చినప్పటికి రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత అయకట్టులో



సగానికికూడా నీరందలేదని అయన అవేదన వ్యక్తం చేశారు.ఈ నేపద్యంలో రాయలసీమ సాగు నీటి వాస్తవ పరస్తితి మీదృస్టికి తీసుకుని రావడమంతో జరిగిన సమాచార లోపం వలన రాయలసీమ సాగు నీటి మౌళిక వసతుల అబివృద్ధికి సరైన నిరంతరం జరుగడము లేదని రాయలసీమ సమాజంబా విస్తుందనిఅయన చెప్పారు. సాగు నీటి లభ్యతరకు అత్యంత అనుకూలమైనపై సంవత్సరముతోరాయలసీమ సాగటు నీటి దుస్తితిపై సాటు నీటిసాదన సమితి తయారు చేఇన అస్తవ్యస్థంగా రాయలసీమ సాగు నీటి వ్యవస్థనివేదికను ముఖ్యమంత్రి కి పంపామని చెప్పారు. రాయలసీమ సాగు నీటి మౌళిక వసుతులు అనగా ప్రాజెక్టుల వారిగా ఏ సంవత్సరము నిర్మాణము మొదలు పెట్టారు.నిర్మాణాలు పూర్తిచేశారు నీటి కేటాయింపుల నిర్దేశితఅయకట్టు అయకుట్టు అబివృద్ధి ప్రస్తుతము సాటు అవతున్న అయకట్టు తదితర అంశాలపై స్వతంత్ర సంస్థతో నిదేవిక రూపొందించాలని అయన ముఖ్మంత్రి దృష్టికి తెచ్చారు. రాయలసీమ సాటు నీటి మౌళిక వసతులపై ఉమ్మడి మద్రాసుఏనుండి అంత్రరాష్ట్రం(1953) ఏర్పడిన నాటి పరిస్థితి విబూలాంధ్ర ఏర్పడిన (15956)నాటి పరిణితతితెలంగానా రాష్ట్రం విడిపోయిన(2014) నాటి పరిస్తితితో పాటు నేటి పరిస్థితి(2023)పై శ్వేత పత్రము విడుదల చేయాలని అయన కోరారు.దీని ద్వారా అయినా రాయలసీమ సాగు నీటి వ్యవస్థలపై సరైన సమాచారముముఖ్యమంత్రికి అందులబాటులోకి వస్తుందని చెప్పారు. జగన్మోహన్రెడ్డి అశయాల ప్రకారము రాయలసీమ సాటు నీటి నిర్ణయాలు తీసుకుంటారని భావిస్తున్నామని దశరథరామిరెడ్డి తన అవాబావాని న్న వ్యక్తం చేశారు.

## అగ్రవర్ణాల ఆగడాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయి

**కర్నూలు న్యూసిటి, జూన్ 29, ప్రభాతవార్తః**
రాష్ట్రంలో బిసి సామాజికవర్గాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తు తెలుగుదేశం పార్టీ బిసి సాధికార సమితి కన్వీనర్ జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వై నాగేశ్వర్యాదవ్ విమర్శించారు. గురువారం కర్నూలులో వైఎస్ఆర్ కారాౄలయం నందు తూరుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి గ్రామంలో యాదవ కులంలో పుట్టిన నాగేంద్రబాబు ఎంతో మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నం చేసుకోవడం ఈప్రభుత్వానికి ప్రభుత్వ అధికారులకు కనిపించడం లేదా వేమగిరి గ్రామంలో అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి రావిపాటి రామచంద్రరావు రౌడీయిజం చేస్తు రాజకీయ పార్టీలను వాడుకుంటూ అక్రమంగా ఎదిగిన వ్యక్తి, బిసి రిజర్వేషన్లో వైయస్ఆర్ పార్టీ తరుపున నాగేంద్రబాబు నాన్న ఎంపిటిసిగా గెలిచారు. అప్పుడు వీరి జీవితాల్లోకి రాక్షసుడిలా వచ్చారు. రావిపాటి రామచంద్రరావు నాగేంద్రబాబు నాన్నకి మాయమాటలు చెప్పి వారి పొలాన్ని రావిపాటి రామచంద్రరావు తమ్ముడి పేరుమీద రాయించుకున్నారు. ఎందుకు అమ్మావు అని నాగేంద్రబాబు నాన్నను వారి కుమారులు అడగగా రామచంద్రరావు నెల నెల ఇస్తానన్నారు. అందుకే వారిపై రాశానని నాగేంద్రబాబు నాన్న కొడుకులతో చెప్పారు. ముఖ్యంగా రావిపాటికి పొలం అమ్మి పెద్ద తప్పు చేశానని నాగేంద్రబాబు నాన్న కుమిలిపోయి ఆ బాధతో ఆరోగ్యం చెడిపోయి చనిపోయారు. నాగేంద్రబాబును వారి కుటుంబాన్ని వేదనకు గురిచేసిన రామచంద్రరావును అరెస్టు చేసి వారి పొలాన్ని వారికి తిరిగి రాయించమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున టిడిపి తరుపున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని



## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష

**పత్తికొండ, జూన్ 29, ప్రభాతవార్త :**
ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జూలై 1 నుండి ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీదేవమ్మ తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక వైసిపి కార్యాలయంలో సచివాలయ కన్వినర్లు, గృహసారథులు, గ్రామ నాయకులతో ఎమ్మెల్యే శ్రీదేవమ్మ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లడుతూ మీ గ్రామ సచివాలయంలో సమస్యలు ఉన్న ప్రతిఒక్కరి సమస్యను నమోదు చేసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కుల,ఆదాయ,దృవీకరణ పత్రాలు, మరణ, జనన,పొలం పట్టాదారు పాస్పుస్తకాలు,వివాహ దృవీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్,హౌస్ ఓల్డ్,కొత్త రేషన్కార్డులు మార్పులు,చేర్పులు వీటన్నింటికి సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా మీరు ముందుగా గుర్తించి అర్హులైన ప్రతిఒక్కరికి పథకాలు అందేలా కృషి చేయాలని తెలియజేశారు. ఎంపిపి నారాయణదాసు,సర్పంచ్, ఎంపిటిసిలు నీలకంఠ,జిల్లా నాయకులు శ్రీరంగడు,పల్లె ప్రతాప్రెడ్డి,రామచంద్ర,నాగరాజు తదితరులున్నారు.

# అషాఢమాసం సందర్బంగా సారెను సమర్పించిన ఉపముఖ్యమంత్రి

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్29, ప్రభాతవార్త**
శ్రీభ్రమరాంబా అమ్మవారికి గురువారంనాడు ఏపి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అషాఢమాసం సందర్బగా అమ్మవారికి సారె(వస్త్రలను) సమర్పించారు.ముందుగా ఆలయ రాజగోపురం వద్ద పూజాదికాలు నిర్వహించిన అనంతరం శ్రీశైలం నియేజకవర్గం శాసన సభ్యులు శిల్పాచక్రపాణిరెడ్డి,దేవదాయశాఖ కమీషనర్ సత్యనారాయణ, ధర్మకర్తల మండలి ఆధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి,శ్రీశైలదేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న,సభ్యులు మేళాతాళలతో వెళ్లి



సమర్పించారు.అనంతరం అమ్మవారి అశీర్వచన మండపంలో వేదపండింతులు,అర్చకస్వాములు వేధాశీర్వాదాలు పలికించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం అదికారులు ప్రముఖులకు శేషవస్త్రలతో సత్కరించి లడ్డు ప్రసాదాలను అందించారు.